RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 181 Issue No. 181 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: సోమవారం 29-06-2026 Monday, June 29 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## ఏపీ ఎప్‌సెట్ ఫలితాల విడుదలకు డేట్ ఫిక్స్



**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీలో లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా మిగతా 2లో..

## దేశంలో బంగారం కొనుగోళ్లు తగ్గడం సంతోషకరం

### మన్‌కీ బాత్ 135వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, జూన్ 28:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో బంగారం కొనుగోళ్లు తగ్గడం సంతోషంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. తాను ఇచ్చిన పిలుపునకు స్పందించి బంగారం కొనుగోళ్లు తగ్గించడంపై ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. మనకీ బాత్ 135వ ఎపిసోడ్‌లో భాగంగా ఆదివారం ప్రధాని పలు అంశాలను ప్రస్తావించారు నాగాలాండ్ విమెన్ ఫుట్‌సల్ లీగ్ గురించి వివరించారు. "పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల దేశ ప్రజలకు కొన్ని విజ్ఞప్తి చేశాను. సాధ్యమైన మేర కొంతకాలం పాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని చెప్పాను. నా పిలుపునకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. సందేశాల ద్వారా వారి అనుభవాలను పంచుకున్నారు. ఇంతకాలం సొంతవాహనాల్లో వెళ్లినవారు.. ఇప్పుడు ఇతరులతో కలిసి వెళ్తున్నారు. ఈసారి విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకున్నామని పలువురు సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తున్నారు" అని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. అలాగే యువత క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ విషయంలో మిగతా 2లో..



## టీకాలను నిర్ణత సమయానికి తప్పనిసరిగా వేయించాలి

### పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు

**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సీఎం క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు ఆయన మిగతా 2లో..

## మత్స్యకార గ్రామాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తాం

### హోంమంత్రి వంగలపూడి అనిత



**నక్కపల్లి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం బోయపాడు, దొండవాక తీరాల్లో రెండు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలకు మరో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి అనిత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడారు. రెండేళ్ల కాలంలో సుమారు రూ.600 కోట్లతో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. "నా నియోజకవర్గంలో మత్స్యకార సోదరులతో మంచి అనుబంధముంది. గతంలో మత్స్యకార గ్రామంలోనే టీచర్‌గా పనిచేశాను. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న మూడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో రెండు పాయకరావుపేట నియోజకవర్గానికి తీసుకొచ్చాం. నియోజకవర్గంలో 9వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. మత్స్యకార గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. ఎన్నికల వరకే పార్టీలు.. ఆ తర్వాత అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యం. నియోజకవర్గానికి బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ తీసుకొచ్చాం. మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని కూడా ఏర్పాటు చేస్తాం" అని అనిత హామీ ఇచ్చారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. వైకాపా పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. వైకాపా నేతలు అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇష్టానుసారం మాట్లాడు తున్నారని.. కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మిగతా 2లో..




## పేదలకు ఉపాధి కల్పిస్తే ఓర్వలేరా జగన్?

### మంత్రి లోకేశ్



**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్మార్ట్ కిచెన్ల ద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం పెడుతుంటే వైకాపా అధినేత జగన్ ఓర్వలేకపోతున్నారని విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా మహిళలు, పేదలకు ఉపాధి కల్పిస్తుంటే జగన్ తట్టుకోలేకపోతున్నారన్నారు. కడప జిల్లాలో 5 స్మార్ట్ కిచెన్లను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని.. హెడ్ కుక్స్, మిగతా 2లో..

## రాజధానిలో అభివృద్ధి చూసి ఓర్వలేకే జగన్ అండ్ కో కుట్రలు

### మంత్రి డీబీవీ స్వామి



**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 3 రాజధానుల పేరుతో అమరావతిపై విషం చిమ్మిన జగన్ అండ్ కో నేడు రాజధానిలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక పోతున్నారని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. అందుకే వైకాపా రౌడీ మూకలు నిన్న రాజధానిలో అల్లర్లు సృష్టించేందుకు కుట్రలు పన్నారన్నారు. ఆ పార్టీ కుట్రల్ని అమరావతి రైతులు తిప్పికొట్టారని తెలిపారు. వైకాపా హయాంలో అమరావతి రైతులపై అక్రమ కేసులు, వేధింపులతో హింసించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు ఏ మొహం పెట్టుకుని వైకాపా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

# ఏపీ ఎప్‌సెట్ ఫలితాల విడుదలకు డేట్ ఫిక్స్

ఎదురుచూస్తోన్న ఎప్‌సెట్ 2026) ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ ఫలితాలను ఈ నెల 30న (మంగళవారం) ఉదయం విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఈ ఫలితాలు విడుదల చేస్తారని జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్, ఎప్‌సెట్ ఛైర్మన్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. అయితే, ఎన్ని గంటలకు ర్యాంకులను ప్రకటిస్తారనే విషయం మాత్రం ఇంకా తెలియలేదు. మే 12 నుంచి 20 వరకు ఎప్‌సెట్ పరీక్షలు జరగ్గా.. దాదాపు 3.29లక్షల మందికి పైగా విద్యార్థులు రాసిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారమైతే జూన్ 1 నాటికే ఈ ఫలితాలు వెలువడాల్సింది. అయితే, ఇంటర్ మార్కులకు 25% వెయిటేజీ ఉండటంతో.. ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ద్వితీయ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు, సీబీఎస్ఈ రివైజ్డ్ ఫలితాలు పూర్తి స్థాయిలో వచ్చే వరకు అధికారులు ఆగడంతో జాప్యం నెలకొంది. తాజాగా సీబీఎస్ఈ రివైజ్డ్ ఫలితాల ప్రక్రియ తుది దశకు చేరడంతో ఈ నెల 30న ఎప్‌సెట్ ఫలితాలను విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

# దేశంలో బంగారం కొనుగోళ్లు తగ్గడం సంతోషకరం

నాగాలాండ్ రాష్ట్రం స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. "ఆ రాష్ట్రంలో 'నాగాలాండ్ బేబీ లీగ్' నడుస్తోంది. 5 నుంచి 12 ఏళ్ల మధ్య వయసులో ఉన్న చిన్నారుల్లో స్ఫూర్తి నింపి.. వారు క్రీడలవైపు మొగ్గుచూపేలా చేస్తోన్న అసాధారణ లీగ్ అది. అదే రాష్ట్రంలో నాగాలాండ్ విమెన్ ఫుట్‌సల్ లీగ్‌ను నిర్వహిస్తున్నారు. ఫుట్‌సల్ పదం చాలామందికి కొత్తగా ఉంటుంది. ఇండోర్ ఫుట్‌బాల్‌ను అలా పిలుస్తారు. ప్రతి జట్టులో కేవలం ఐదుగురు ఆటగాళ్లు మాత్రమే ఉంటారు. సాధారణ ఫుట్‌బాల్ మైదానంతో పోలిస్తే.. వారు ఆడే స్థలం చాలా చిన్నగా ఉంటుంది. దీంతో ఆటగాళ్లు చాలావేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆడబిడ్డల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఇది అద్భుతమైన వేదికగా నిలుస్తోంది" అని మోదీ కొనియాడారు. అంతరించిపోతున్న హర్గిలా పక్షిని రక్షించడంలో అస్సాం 'హర్గిలా ఆర్మీ' చేస్తోన్న కృషిని ప్రధాని మోదీ కొనియాడారు. ఒకప్పుడు ఈ పక్షిని అశుభంగా భావించేవారు. కానీ, ఇప్పుడు అది ఆ రాష్ట్రంలోని గ్రామాలకు ఒక గుర్తింపుగా మారిపోయింది. "ప్రకృతిని శుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించిన ఈ పక్షిని ఒకప్పుడు చూడటానికి కూడా ఇష్టపడలేదు. దాని గూడులున్న చెట్లను కూడా కొట్టివేసేవారు" అని ప్రధాని వెల్లడించారు. ఆ మూఢనమ్మకాన్ని జీవశాస్త్రవేత్త పూర్ణిమా దేవి బర్మన్ మార్చివేశారన్నారు. దాంతో ఇప్పుడు ఆ పక్షిని కాపాడేందుకు హర్గిలా ఆర్మీనే సిద్ధమైందని చెప్పారు.

# మత్స్యకార గ్రామాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తాం

ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణ పనులకు అడ్డుతగులుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే నిరంతరం అనిత ఆలోచిస్తారన్నారు. ఆమె ప్రజల మెప్పు పొందారని బీసీ జనార్దన్‌రెడ్డి కొనియాడారు.

# పేదలకు ఉపాధి కల్పిస్తే ఓర్వలేరా జగన్?

అసిస్టెంట్ కుక్స్, హెల్పర్లు, డ్రైవర్లకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. వీటితోపాటు జిల్లాలో 33 స్మార్ట్ కిచెన్లు ఏర్పాటుచేసి.. 392 మందికి ఉపాధి కల్పించబోతున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుంటే జగన్‌క్ బాధ ఎందుకని లోకేశ్ ప్రశ్నించారు. పేదలు బాగుపడితే చూడలేకపోతున్నారా? అని నిలదీశారు.

# రాజధానిలో అభివృద్ధి చూసి ఓర్వలేకే జగన్ అండ్ కో కుట్రలు

నేతలు రాజధానికి వెళ్తారని ప్రశ్నించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించామని.. రాజధానిలో పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. జగన్ ఇంకా మావిగన్ అంటూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ వైఖరిలో ఏ మాత్రం మార్పు లేదన్నారు. జగన్ అండ్ కో కుట్రలను ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. అమరావతి దేవతల రాజధాని అని.. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా ఏం చేయలేరని స్పష్టం చేశారు.

# శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి



**కవిటి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జమేదారిపుట్టుగ వద్ద జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో బ్రహ్మపుర వెళ్లేందుకు ఆగి ఉంది. ఈ క్రమంలో పలాస వైపు నుంచి వస్తున్న లారీ ఆటోని ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు మురపాల పార్వతి, నర్తు పద్మమ్మ, మండపల్లి తరినమ్మగా గుర్తించారు. ప్రమాదంపై కవిటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలి

**(మొదటి పేజీ తరువాయి)**

పోలియో చుక్కలు వేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సీఎం ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని కాసేపు ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలను తెలుసుకున్నారు. ఉద్యోగం, ఉపాధికి వెళుతున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని తల్లిదండ్రులను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లల్ని కని, పెంచడం, వారి ఆలనా పాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని చెప్పారు. పిల్లలను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదన్నారు. అలాంటి వ్యవస్థ మళ్లీ రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలన్నారు. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని చెప్పారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామన్నారు.

# తితిదేకు భారీగా విరాళాలు ప్రకటించిన అనంత్ అంబానీ



**తిరుమల, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ తితిదేకి భారీగా విరాళాలు ప్రకటించారు. తితిదేకు 25 ఎలక్ట్రిక్ బస్సులు విరాళంగా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. 50 మంది బస్సు డ్రైవర్ల జీతభత్యాలు కూడా చెల్లించడంతో పాటు, తిరుమలలో ఛార్జింగ్ స్టేషన్‌ను రిలయన్స్ ఏర్పాటు చేయనుంది. గుజరాత్ వంతారాలో ఉన్నట్టుగా తితిదే గోశాలను ఆధునికీకరణకు అంగీకారం తెలిపారు. ఇవాళ వేకువజామున శ్రీవారి సుప్రభాత సేవలో అనంత్ అంబానీ పాల్గొన్నారు. అంతకముందు తితిదే అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో మూలవిరాట్టును దర్శించుకున్న అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# రాజమహేంద్రవరంలో భారీ వర్షం.. రోడ్లపైకి చేరిన వరద నీరు

**రాజమహేంద్రవరం, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజమహేంద్రవరంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో కురవడంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి ఎండలో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. భారీ వర్షానికి నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, శ్యామల సెంటర్, కోటిపల్లి బస్టాండ్, డీలక్స్ సెంటర్, హైటెక్ బస్టాండ్, ఆదాయ పన్నుశాఖ కార్యాలయం రోడ్డు, కంబాలచెరువు, కోరుకొండ రోడ్డు తదితర ప్రాంతాల్లో వరదనీరు రహదారిపైకి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



# సంక్షేమంతో పాటు...అభివృద్ధి కూడా ముఖ్యమే

కేవలం సంక్షేమంతో అభివృద్ధిని సాధించలేం... కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదు...

జనసేన నిర్మాణ సారధుల కార్యాచరణ సమావేశంలో పవన్



**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఒక్క సంక్షేమ పథకాలే కాదు..అభివృద్ధి కూడా ముఖ్యమన్నది జనసేన విదానమని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల విషయంలో జనసేన పార్టీకి ఎలాంటి వ్యతిరేకత లేదని అన్నారు. నిజంగా నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వ సహాయం, ఉచిత పథకాలు అవసరమేనని ఆయన పేర్కొన్నారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యం కాదని, ప్రజలు అభివృద్ధిని కూడా కోరుకుంటారని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల అభివృద్ధి కూడా చాలా ముఖ్యమని అన్నారు. దీనిపై గ్రామస్థాయిలోనే చర్చ సాగాలని పార్టీ నేతలకు పవన్ సూచించారు. కేవలం బటన్ నొక్కి నగదు బదిలీలు చేస్తే ప్రజలు ఎప్పటికీ ఓట్లు వేస్తారనే భావన సరికాదని అన్నారు... అలాంటి రాజకీయాలకు నిలువెత్తు ఉదాహరణ గత ప్రభుత్వం అని, సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కూడా సమానంగా ఉండాలని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పవన్ విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంతసేపు బటన్ నొక్కి డబ్బులు పంపించామని చెప్పడం కంటే, ప్రజలు ప్రయాణించే రోడ్లు ఎవరు వేశారు? దశాబ్దాలుగా నిర్మించని రహదారులు ఇప్పుడు ఎలా నిర్మితమయ్యాయి? అనే విషయాలను కూడా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.. ప్రజలకు సంక్షేమం ఎంత అవసరమో, నాణ్యమైన రహదారులు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతులు కూడా అంతే అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తమ బాధ్యతగా అభివృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఎన్ని ఉచిత పథకాలు అమలు చేసినా ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందరని పేర్కొన్నారు. వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడుతున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లాడిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించ నని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కులాలతో రాజకీయాలు చేయను, చేయబోనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తా. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారు.. అది సరికాదు. ఎన్ని ఏళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకున్నాం. కమిటలో ఉన్న వారికి విధివిధానాలు అందిస్తాం. సేకరించిన సమాచారాన్ని నా దృష్టికి తేవాలి. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని పవన్ సూచించారు. గాదె సాయికృష్ణ వివాదంపై పవన్ కల్యాణ్ స్పందించారు. కృష్ణలంకలో ఒక గొడవ జరిగితే క్రిమినల్‌కు కులాన్ని ఎలా అంటగడుతున్నారని ప్రశ్నించారు. తప్పు ఎవరు చేసినా.. ఏ కులం వారు చేసినా.. తప్పే కదా అని నిలదీశారు. కాపు అయితే ఒప్పు.. ఇంకొకరు అయితే తప్పు అవుతుందా అని ప్రశ్నించారు. తనకు పేపర్లు, ఛానళ్లు లేవని.. జనసైనికులే తన మీడియా అని వ్యాఖ్యానించారు. ఇలాంటి అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాలను సమానంగా చూడటమే సామాజిక న్యాయమని తెలిపారు. కుల రాజకీయం పొలిటికల్ విక్టరీ అవుతుందేమో గానీ.. సామాజిక విక్టరీ కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అధికారం ఎప్పుడూ జగన్ అండ్ కో చేతిలోనే ఉండాలా అని ప్రశ్నించారు. వైసీపీ వాళ్లను చూడాలి.. ప్రతి అంశంలోనూ కులాన్ని, మతాన్ని కూడా వాడతారని ఎద్దేవా చేశారు. వైసీపీలో పనిచేసిన నాయకులు మన వేదిక మీద ఉన్నారని ప్రస్తావించారు. వీరు దిగజారి మాట్లాడిన దాఖలాలు ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. వైసీపీలో ఇతర నేతలు నోరు తెరిస్తే అసభ్య వ్యాఖ్యలే చేస్తారని.. వ్యక్తిత్వ హననాలు చేస్తారని చెప్పుకొచ్చారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ మనిషి.. ఆయన విలువలతో మాట్లాడారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 18వేల మంది సాధక్‌లను కలవాలనేది తన భావన అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ప్రతి ఊరిలో బాధ్యతలు అప్పగించిన నాయకుడు.. అక్కడ 2వేల మంది ప్రజలకు తెలిసి ఉండాలని తెలిపారు. ఎమ్మెల్సీ నాగబాబును అరకుకు పంపించామని.. ఆయన జనాలతో మాట్లాడతారని.. ప్రకృతిని సంరక్షిస్తారని అన్నారు. పల్నాడుకు బాలినేని శ్రీనివాసరెడ్డి కరెక్టు అని భావించి.. ఆ బాధ్యత అప్పగించామని చెప్పారు. కాకినాడను తట్టుకోవాలంటే.. సామినేని ఉదయభాను కరెక్టు అని భావించామని తెలిపారు. మంత్రి కందుల దుర్గేశ్‌ని అమలాపురం పంపితే బంధువులు ఎక్కువ అని అన్నారని చెప్పారు. మొహమాటానికెళ్లి.. ఎవరినైనా పెట్టాల్సి వస్తుందేమేనని ఆయన అన్నారని చెప్పారు. కానీ ఈ విషయంలో పని చేసే వారికే ప్రాధాన్యం అనేది ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. 'పుష్కర కాలం పాటు మీరంతా నలిగారని.. మీరు ఏపని చేస్తున్నారో కాదు.. దేశానికి సేవ చేసే వారిని ప్రోత్సహిస్తా' అని స్పష్టం చేశారు. తనకు దేశం తర్వాతే ఏదైనా.. కులం అనేది సోషల్ రియాలిటీ అని చెప్పుకొచ్చారు. తాను ఈ విషయాన్ని మార్చాలనో, సరిదిద్దాలనో ప్రయత్నం చేయనని పేర్కొన్నారు. తాను కులాల గురించి మాట్లాడతానని కొంతమంది అంటారని.. తాను కులం కార్డు తీసుకుని ఎప్పుడూ పాలిటిక్స్ చేయనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రం బాగుండాలని, దేశం బాగుండాలని.. మానవత్వం ఉండాలనేదే తన ఆలోచన అని వ్యాఖ్యానించారు. కులం ఎప్పుడూ ఇంటి గడప లోపలే ఆగిపోవాలని.. గడప దాటాకా మన సంస్కృతి, ధర్మాలు ఉండాలని సూచించారు. ఇంకో పది అడుగులు వేస్తే.. దేశం, మానవత్వం గుర్తుకు రావాలని తెలిపారు. స్థాయికి దిగజారి మాట్లాడే వారికి కూడా కౌంటర్‌గా తాను మాట్లాడాల్సి వస్తుందని అన్నారు. క్షేత్రస్థాయిలోకి మీరంతా ఓ మెసేజ్ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ కాకుండా పిల్లలు అందరికీ ఒకే హాస్టల్ ఉండాలనేది తన కోరిక అని ఉద్ఘాటించారు. ఆయా ప్రభుత్వాలే దశాబ్దాలుగా ఈ కులాల పేరుతో పిల్లలను విడదీస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఓట్ల కోసం ప్రజల్లోకి వెళ్తే.. ఇటు దళితులు, అటు కాపులు, ఈ రోడ్డులో బీసీలు అంటూ విడగొట్టి మాట్లాడతారని అన్నారు. రాజకీయం ఇలానే నడుస్తుందనేది తనకు తెలియదని.. తనకు కులాల ఐక్యత ముఖ్యమని స్పష్టం చేశారు. కులం ఐడెంటిటీని తాను మార్చలేనని... లింగమనేని రమేశ్‌కు రాజ్యసభ ఇస్తే.. ఆ కులం మీద కొంతమంది చర్చ, రచ్చ చేశారని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు.

# 30 ఏళ్ల కల పూర్తయ్యిందన్న రైతులు

చంద్రబాబుతో భేటీలో రైతులు భావోద్వేగం

**మార్కాపురం, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైతులతో సీఎం చంద్రబాబు సమావేశం భావోద్వేగభరిత వాతావరణంలో సాగింది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేలా కృషి చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు.వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి సమావేశానికి రైతులు తరలివచ్చారు. పొలాల మధ్య రైతులు, నిర్వాసితులతో సీఎం సమావేశమయ్యారు. 30 ఏళ్ల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామంటూ.. రైతులు కన్నీళ్లు పెట్టుకుని భావోద్వేగానికి గురయ్యారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు ఆర్ అండ్ ఆర్ కూడా సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నందుకు సంతోషంగా ఉందని వెలిగొండ నిర్వాసితులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబును రైతులు కోరారు. ఈ సమావేశానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, డీబీవీ స్వామి, గొట్టిపాటి రవి కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు హాజరయ్యారు.

# ఆటోను ఢీకొన్న కారు: ఒకరు మృతి

**ఏలూరు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భీమడోలు మండలం కూరెళ్లగూడెం - పూళ్ల గ్రామాల మధ్య 216ఏ జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ఆటోను కారు బలంగా ఢీకొట్టింది. వివరాల్లోకి వెళ్తే.. ఏలూరు దగ్గర కొప్పాక గ్రామం నుంచి ఆటోలో డ్రైవర్‌తో సహా ఐదుగురు వ్యక్తులు మేకలు కొనుగోలు చేయడానికి తాడేపల్లిగూడెం వెళుతున్నారు. కూరెళ్ల గూడెం దాటిన తర్వాత కూరెళ్లగగూడెం- పూళ్ల మధ్యలో వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి ఆటో, కారు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి పడిపోయాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి చనిపోగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులును చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# భాగ్యరాజ్ మృతి పట్ల పవన్ దిగ్భ్రాంతి

ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన

**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ దర్శకుడు, నటుడు, రచయిత కె. భాగ్యరాజ్ మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. భాగ్యరాజ్ కన్నుమూశారని తెలిసి చింతించానని చెబుతూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. రచయితగా, సహాయ నటుడిగా భాగ్యరాజ్ సినీ జీవితాన్ని ప్రారంభించారన్నారు. అనంతరం తమిళ చిత్ర పరిశ్రమలో దర్శకుడిగా, హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయన దర్శకత్వం వహించిన, కథ-స్క్రీన్‌ప్లే అందించిన అనేక చిత్రాలు తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో రీమేక్ అయి ఘనవిజయం సాధించాయని గుర్తు చేశారు. ప్రేమ, కుటుంబ కథలను ఆయన మలిచిన తీరు ఒక తరం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని పవన్ తెలిపారు. తన సినిమాల ద్వారా భారతీయ సినీ రంగంలో చెరగని ముద్ర వేశారని అన్నారు. ఈ సందర్భంగా కె. భాగ్యరాజ్ కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# అమరావతిని నిర్లక్ష్యం చేసి...ఇప్పుడు డ్రామాలా

రైతుల పరిరక్షణ పేరుతో వైకాపా దొంగాట

మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు

**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతి రైతుల పేరుతో వైసీపీ మరోసారి రాజకీయ డ్రామాకు తెరలేపిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతుల మనోభావాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం వైసీపీకి అలవాటేనని ఆరోపించారు. అమరావతిని నిర్వీర్యం చేసిన వారే ఇప్పుడు రైతుల పరిరక్షణ పేరుతో మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. అమరావతి రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధిలేని వైసీపీ నేతలు.. ప్రజలను రెచ్చగొట్టి, ఆ తర్వాత బాధితులమని చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడం వైసీపీ రాజకీయ శైలిగా మారిందని ఆయన అన్నారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకున్న పార్టీ ఇప్పుడు అదే ప్రాంతంలో రైతుల పక్షాన నిలుస్తున్నట్లు నటించడం ప్రజలను మోసం చేయడమేనని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతిని నిర్వీర్యం చేసిన వారే రైతుల పరిరక్షణ గురించి మాట్లాడటం పూర్తిగా ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఘటనల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు పోలీసులపై దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని అచ్చెన్న ఖండించారు. చట్టాన్ని అమలు చేసే పోలీసులపై దాడులను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో హింసాత్మక రాజకీయాలకు చోటు లేదని, అలాంటి రాజకీయాలను ప్రజలు ఇప్పటికే తిరస్కరిస్తున్నారని చెప్పారు.

# తిరుపతి మినహా అన్ని విమానాశ్రయాల్లో బార్లు

బార్ లైసెన్స్‌లకు ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు

**అమరావతి, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి మినహా మిగిలిన అన్ని విమానాశ్రయాల్లో బార్‌లు ఏర్పాటు చేయాలని ఏపి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విమానాశ్రయాల్లో బార్ లైసెన్స్‌లు మంజూరు చేయాలని ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక విమానాశ్రయ బార్ లైసెన్స్ కింద గరిష్ఠంగా 3 సర్వీసింగ్ పాయింట్లకు అనుమతించింది. 24 గంటల పాటు బార్‌లు తెరుచుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే, విమానాశ్రయ కార్యాచరణ అవసరాలకు లోబడి బార్‌లు తెరవాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. భద్రతా ఆదేశాలు, శాంతిభద్రతల అవసరాలకు లోబడి పని చేయాల్సి ఉంటుందని తెలిపింది. విమానాశ్రయాల్లో బార్ లైసెన్స్‌ల నిర్వహణపై మంత్రుల బృందం అధ్యయనం చేసింది. దిల్లీ, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అవలంబిస్తున్న విధానాలను పరిశీలించింది. మంత్రుల బృందం సూచనలతో లైసెన్స్ రుసుము, పని వేళలు, మద్యం అందించే కేంద్రాల కౌంటర్లపై తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# భోగాపురం ప్రారంభ తేదీని త్వరలో ప్రకటిస్తాం: కలెక్టర్

**విశాఖపట్నం, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త కిషోర్ అన్నారు. విశాఖ- భోగాపురం ఎయిర్‌పోర్టు అనుసంధానానికి సంబంధించి 7 రోడ్లలో ఐదింటిని పూర్తి చేసినట్లు చెప్పారు. విశాఖ నుంచి డెడికేటెడ్ ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. ఎయిర్‌పోర్టు కోసం డెడికేటెడ్ బస్ బే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

## నేటి మనదేశం సంపాదకీయం

# ప్రజల్లో ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా?

దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ది కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయికృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో దృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

# సీషెల్స్ పర్యటనలో వృద్ధ తాబేలును చూడనున్న మోడీ

**న్యూఢిల్లీ,జూన్28(ఆర్ఎన్ఎ): హిందూ మహాసముద్ర ద్వీపం సీషెల్స్‌లో** వచ్చే వారం ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ పర్యటన వేళ ఆయన అక్కడ నేషనల్ బోటానికల్ గార్డెన్స్‌ను సందర్శించనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన అక్కడ ఓ వృక్షాన్ని నాటనున్నారు. భారత్, సీషెల్స్ మధ్య 50 ఏళ్ల దౌత్య బంధానికి ప్రతీకగా ప్రధాని మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ సంబరాల్లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఇక ప్రపంచంలో ప్రాణాలతో ఉన్న అతి వృద్ధ జంతువును కూడా ప్రధాని మోదీ దర్శించుకోనున్నారు. 1832లో పుట్టిన తాబేలును ఆయన వీక్షించనున్నారు. ఆ తాబేలు పేరు జోనాథన్. ఇప్పుడు అది సుమారు 194 ఏళ్లు ఉంటుందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అంచనా వేసింది. సుమారు రెండు శతాబ్దాలకు చేరుకున్న ఆ జంతువు ఎన్నో చరిత్రాత్మక సందర్భాలకు సాక్షీగా నిలిచింది. వయసు మీరినా ఆ తాబేలు మాత్రం ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెటరర్నీ డాక్టర్లు దాని ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. అయితే వయసు రీత్యా ఆ తాబేలుకు కంటి చూపు మందగించింది. వాసన గుర్తుపట్టే గుణాన్ని కూడా కొంత కోల్పోయినట్లు తెలుస్తోంది.

# వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌కు ట్రంప్

## ధృవీకరించిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో... భారత్ -యూఎస్ బంధం బలోపేతం అంటూ కితాబు

**వాషింగ్టన్,జూన్28(ఆర్ఎన్ఎ):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. ట్రంప్ భారత్ పర్యటన కోసం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించామని, ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షిస్తానని తెలిపారు. భారత్‌-అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ- ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ-ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్‌-అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి




చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై రూబియో ప్రశంసలు కురిపించారు. తాను ఆయనకు అభిమానినని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ స్థాయిని పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మోదీ భారత్‌ను ఒక ప్రపంచ శక్తిగా మార్చారని కొనియాడారు. భారత్‌-అమెరికా బంధం ప్రస్తుతం ఎంతో బలంగా ఉందని మార్కో రుబియో పేర్కొన్నారు. వైట్ హౌస్‌లో ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రుబియో మాట్లాడారు. 'వచ్చే ఏడాది ప్రారంభంలో అధ్యక్షుడు ట్రంప్, భారత్ పర్యటనకు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. అదే మా లక్ష్యం' అని చెప్పారు. అలాగే, అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేస్తోందని వ్యాఖ్యానించారు. లాగే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని కూడా రుబియో తెలిపారు . ఈ ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనివల్ల భారత్‌-అమెరికా ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే క్వాడ్ దేశాల నేతల సమావేశం కూడా త్వరలో నిర్వహించాలని అమెరికా ఎదురుచూస్తోందని చెప్పారు.

# ఆదానీ లంచం కేసులో ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం

## కేసు ఉపసహంరణకు నివేదిక ఇవ్వాలని జడ్జి ఆదేశం

**న్యూయార్క్,జూన్28(ఆర్ఎన్ఎ):** బిలియనీర్ గౌతమ్ అదానీ పై నమోదైన హై-ప్రొఫైల్ లంచం కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీతోపాటు ఇతర నిందితులపై ఉన్న క్రిమినల్ ఆరోపణలను తక్షణమే కొట్టివేసేందుకు ఫెడరల్ జడ్జి నిరాకరించారు. ఈ కేసును ఎందుకు ఉపసంహరించుకోవాలని అనుకుంటున్నారో తెలుపుతూ మరింత స్పష్టమైన, వివరణాత్మకమైన నివేదికను సమర్పించాలని అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్‌ను కోర్టు ఆదేశించింది. బ్రూక్లిన్ లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కేసును ఉపసంహరించుకోవాలంటూ మే 18న జస్టిస్ డిపార్ట్‌మెంట్ దాఖలు చేసిన పిటిషన్ చాలా క్లుప్తంగా, ఎలాంటి బలమైన కారణాలు లేకుండా ఉందంటూ ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. కేసును ఎందుకు డ్రాప్ చేయాలనుకుంటున్నారో సరైన ఆధారాలు, కారణాలతో కూడిన నివేదికను జూలై 13 లోగా కోర్టుకు సమర్పించాలని ప్రాసిక్యూటర్లను ఆదేశించారు. భారత్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఆమోదం కోసం ప్రభుత్వ అధికారులకు వందల మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించారని, అలాగే అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారని గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై 2024లో అమెరికాలో కేసు నమోదైంది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కేసుపై మరింత సమయం, వనరులను కేటాయించలేమని పేర్కొంటూ కేసును పూర్తిగా ఉపసంహరించుకోవాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్ భావించింది. జూన్ 24న అదానీ తరపు న్యాయవాదులు కూడా ఈ కేసు అమెరికా అధికార పరిధిలోకి రాదని, లంచం ఇచ్చినట్లు నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును అధికారికంగా కొట్టివేయాలని కోర్టును కోరారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం నుంచి పూర్తి వివరణ కావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు. ఈ క్రిమినల్ కేసు పక్రియ ఇలా ఉండగా.. దీనికి సమాంతరంగా నడుస్తున్న సివిల్ వివాదాల పరిష్కారానికి అదానీ గ్రూప్ అంగీకరించింది. ఇందులో భాగంగా గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్ల మేర సివిల్ సెటిల్‌మెంట్ కింద చెల్లించే ప్రతిపాదనలు కోర్టు అనుమతి కోసం వేచి ఉన్నాయి. ఇవి కాకుండా ఇరాన్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ దిగుమతులకు సంబంధించి అమెరికా ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణల పరిష్కారానికిగాను అదానీ ఎంటర్‌ప్రైజెస్ అమెరికా ట్రెజరీకి 275 మిలియన్ డాలర్లు చెల్లించడానికి ఒప్పుకుంది.

# గోదావరి వరదలపై అప్రమత్తం కండి

## గతానుభవాలతో ముందస్తు నష్టనివారణ చర్యలు
## పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం పరిశుభ్రంగా ఉండాలి
## అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశాలు

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 28(ఆర్ఎన్ఎ):** గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.



గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గోదావరి వరదల సన్నద్ధతపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశంలోపలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశర చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ఎ÷-లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణెశిశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

# హైదరాబాద్‌లో డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ

## భారత్‌కు కృతజ్ఞతలు అంటూ ట్రూత్‌తో ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,జూన్28(ఆర్ఎన్ఎ):** భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కనున్న రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అని పేరు పెట్టిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'ఈ విధంగా గౌరవం పొందిన అమెరికా తొలి అధ్యక్షుడిని నేను. ధన్యవాదాలు భారత్' అంటూ ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో పోస్టు చేశారు. అమెరికా 250వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న హైదరాబాద్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేశారు.

ఆ ప్రత్యేక ఫలకాన్ని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో కలిసి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆవిష్కరించారు. మెరికాకు చెందిన కీలక టెక్ కంపెనీలు అయిన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్‌లు ఈ రోడ్డుకు దగ్గర్లోనే ఉన్నాయి. ఈ పేరు మార్పును తెలంగాణ ప్రభుత్వం భారత్‌-అమెరికా సంబంధాలకు గుర్తింపుగా, అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో తీసుకున్న ప్రతీకాత్మక నిర్ణయంగా పేర్కొంది.

# ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

## వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు..... మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

**హైదరాబాద్,జూన్28(ఆర్ఎన్ఎ):** తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన పక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి



ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల పక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ పక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే పక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన పక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన పక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరని అన్నారు.

# తగినంత విటమిన్-డి అందాలంటే ఏ సమయంలో, ఎంతసేపు ఎండలో ఉండాలి

## విటమిన్-డి లోపం...

ఇండియాలో ఇప్పుడు చాప కింద నీరులా వ్యాపిస్తున్న సమస్య. నిన్నమొన్నటి వరకు సూర్యరశ్మి సమృద్ధిగా లభించే మన దేశంలో ఈ సమస్యే రాకపోవచ్చని భావించారంతా. కానీ, రెండేళ్ల క్రితం నిర్వహించిన ఓ పరిశోధనలో దేశంలో ఏకంగా 76 శాతం ప్రజలు విటమిన్-డి లోపంతో బాధపడుతున్నారని తేలింది. ది ఫెడరేషన్ ఆఫ్ ఆబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా తాజా పరిశోధన ప్రకారం, 50 నుంచి 94 శాతం మంది మహిళల్లో విటమిన్-డి లోపం కనిపిస్తోందని తేలింది. సూర్యరశ్మిలో విటమిన్-డి లభిస్తుందని మనందరికీ తెలుసు. కానీ శరీరానికి తగినంత విటమిన్-డి లభించాలంటే రోజులో ఎంత సేపు ఎండలో నిలబడాలి?



### వెలుగునిచ్చే సూర్యుడు మనిషిలో ఉత్సాహాన్ని నింపుతాడు

తెల్లవారుజామునే సముద్ర తీరంలో కూర్చుని లేలేత సూర్య కిరణాలు చూడడం అనేది చాలామందికి ఆహ్లాదం కలిగించే విషయం. ఎందుకు? కడప జిల్లాలోని గండికోట జలాశయాన్ని చూసేందుకు వెళ్లే వాళ్లంతా రాత్రంతా అక్కడే టెంట్లు వేసుకొని ఉండి, ఉదయం కాగానే ఆ ఎర్రని రాళ్లపై పడే సూర్య కిరణాలను చూసేందుకు ఎందుకు ఎగబడుతుంటారు? అంతెందుకు.. నిన్నగాక మొన్న తూర్పుగోదావరి జిల్లాలో విపరీతంగా ప్రాచుర్యంలోకి వచ్చిన పర్యటక కేంద్రం గుడిసెను సందర్శించి, ఆ కొండపైన పచ్చని గడ్డిమైదానాల్లో ఉదయపు సూర్యుడిని వీక్షించేందుకు ప్రకృతి ప్రియులు ఎంత కష్టమైనా ఎందుకు వెళ్తున్నారు? వీటన్నిటికీ సమాధానం ఒక్కటే... వెలుగునిచ్చే సూర్యుడు మనిషిలో ఉత్సాహాన్ని కూడా నింపుతాడు. నూతన శక్తినిస్తాడు. వైద్య పరిభాషలో చెప్పాలంటే సూర్యుని వల్ల పైసా ఖర్చు లేకుండా లభించే విటమిన్-డి శరీర పోషణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలో ఉండే ఇంటర్నల్ క్లాక్ వ్యవస్థకు ప్రతి రోజూ కొంత మోతాదులో సూర్యరశ్మి అవసరం. అప్పుడే శరీరంలో ఉండే ఇంటర్నల్ క్లాక్ సిస్టమ్ బాహ్య ప్రపంచంలోని మార్పులను తనలో ఇముడ్చుకుంటుంది. ఇంకో రకంగా చెప్పాలంటే, సూర్యరశ్మి మన మెదడులో మెలటొనిన్ అనే హార్మోన్ తయారీని అడ్డుకుంటుంది. ఈ మెలటొనిన్ హార్మోన్ ఓ రకంగా నిద్రకు కారణమవుతుంది. సాధారణంగా రాత్రి 8 గంటలకు మొదలయ్యే దీని ప్రభావం రాత్రి ఒంటిగంట సమయంలో పతాక స్థాయికి చేరుకుంటుంది. ఉదయం కాగానే సూర్యుని వెలుగు కారణంగా ఈ హార్మోన్ తయారీ క్రమంగా ఆగిపోతుంది. ఫలితంగా శరీరం ఉత్తేజితమవుతుంది.

### శరీర పోషణలో కీలక పాత్ర పోషించే విటమిన్-డి

నిజానికి ఓ 30-40 ఏళ్ల క్రితం వరకు మన దేశంలో డి-విటమిన్ లోపం అన్న మాట పెద్దగా వినిపించేది కాదు. అప్పట్లో సగటు భారతీయుడు పగలంతా ఎండలో కష్టపడి పని చేసి రాత్రి సేదదీరేవాడు. ఫలితంగా శరీరానికి అవసరమైన సూర్యరశ్మి అందడం వల్ల పెద్దగా సమస్యలు తలెత్తవి కాదు.కానీ, ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. జలంధర్‌లోని గార్డియన్ హాస్పిటల్‌లో పని చేస్తున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సంజీవ్ గోయల్ ఆధర్యంలో 2020లో దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో దేశంలో 76శాతం మంది విటమిన్-డి లోపంతో బాధపడుతున్నారని తేలింది. మరీ ముఖ్యంగా 18-30 ఏళ్ల మధ్య వయస్కుల్లో అయితే ఏకంగా 82.5 శాతం మంది డి-విటమిన్ లోపంతో బాధపడుతున్నారు. డాక్టర్ సంజీవ్ గోయల్ నిర్వహించిన రీసెర్చ్ స్టడీ ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ ఆర్థోపెడిక్స్ 2020 మే-జూన్ ఎడిషన్లో ప్రచురితమయ్యింది. యువతలోనూ, వృద్ధుల్లోనూ ఎక్కువగా విటమిన్-డి లోపం ఉందని ఈ పరిశోధన తేల్చింది.

### మహిళల్లో తీవ్ర ప్రభావం

అటు మహిళల్లోనూ ఇది చాపకింద నీరులా ప్రవేశిస్తోందని, దేశం మొత్తం మీద 50 నుంచి 94 శాతం మంది మహిళల్లో ఇప్పుడు విటమిన్-డి లోపం కనిపిస్తోందని కొద్ది రోజుల క్రితం ది ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రెక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ముఖ్యంగా ఇతర వ్యాధుల కోసం చికిత్స తీసుకుంటున్న సమయంలో దీనిని గుర్తించడం వల్ల సరైన సమయానికి సరైన చికిత్స తీసుకోవడంలో కూడా ఆలస్యమవుతోందని తెలిపింది.

### డి-విటమిన్ ఎందుకు లోపిస్తోంది?

నిన్నమొన్నటి వరకు డి-విటమిన్ విషయంలో మన వాతావరణ పరిస్థితులే మనకు వరమని వైద్య నిపుణులు భావించేవారు. అందువల్లే మన దేశంలో డి-విటమిన్ లోపం గురించి, సూర్యరశ్మి అవసరం గురించి కొన్నేళ్ల క్రితం వరకు పెద్దగా చర్చ జరగలేదు.అయితే గత మూడు, నాలుగు దశాబ్దాలుగా పెరుగుతూ వస్తున్న నగరీకరణ, ఆధునిక జీవన శైలి సగటు భారతీయుడిని సూర్యరశ్మికి క్రమంగా దూరం చేస్తూ వస్తోంది. దానికి తోడు కాలుష్యం, తీసుకునే ఆహారంలో మార్పులు ఇవన్నీ డి-విటమిన్ లోపానికి కారణాలే అంటున్నారు వైద్య నిపుణులు.

మనిషి శారీరక, మానసిక వికాసంలో డి విటమిన్ పాత్ర చాలా కీలకం. మెటబాలిక్ ఫంక్షన్స్, ఇమ్యూన్ సిస్టమ్, ఎముకల పటుత్వం, మానసిక ఆరోగ్యం వీటన్నింటికీ డి విటమిన్ అత్యవసరం. ఈ లోపం వల్ల మానసిక కుంగుబాటుకు గురవుతారని, ఆందోళన పెరిగి, క్షణక్షణం మనిషి మూడ్స్ మారిపోతూ ఉంటాయని కూడా పరిశోధనలు చెబుతున్నాయి.

### ఎంత సేపు ఎండలో ఉండాలి?

ఒక్కో ప్రాంతంలో ఒక్కో మనిషికి ఒక్కోలా సూర్యరశ్మి అవసరం ఉంటుంది. మన దేశం విషయానికి వస్తే ఉదయం, సాయంత్రపు ఎండ మంచిదన్నది వైద్య నిపుణుల సూచన.



తెలుపు, గోధుమ వర్ణంలో చర్మం ఉండే వారు రోజు కనీసం 20 నిమిషాలు నేరుగా శరీరానికి సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. అలా వారంలో కనీసం 3 నుంచి నాలుగుసార్లు ఎండలో ఉండటం ద్వారా శరీరానికి తగిన డి-విటమిన్ లభిస్తుంది. అదే నలుపు రంగు చర్మం వారు కనీసం 30 నుంచి 40 నిమిషాల పాటు వారంలో 3- 4 రోజులు సూర్యరశ్మి నేరుగా శరీరానికి తగిలేలా చూసుకోవాలి. ముఖ్యంగా మోచేతులు, ముఖానికి నేరుగా ఎండ తగలాలి. ఎలాంటి సన్ స్క్రీన్ లోషన్లు పూసుకోకూడదు. అలాగే ముఖాన్ని వస్త్రంతో కప్పి ఉంచకూడదు. ఒకే చోట నిల్చుని ఉండకుండా అటూ ఇటూ తిరగడం మంచిది. ఎండలోంచి వచ్చిన తర్వాత అవసరం అనుకుంటే అలోవెరా వంటి లోషన్లు శరీరానికి రాసుకోవచ్చు. ఇక ఎండలోకి వెళ్లే పరిస్థితి లేనప్పుడు కనీసం మీరు పని చేసే చోటైనా సూర్యరశ్మి తగిలేలా చూసుకోండి. వీలైతే కిటికీ పక్కనే సూర్యరశ్మికి వ్యతిరేక దిశలో కూర్చోండి. మీరు పని చేస్తున్న కంప్యూటర్ పక్కన, మీ కంటికి తగిలేలా ఓ లైటును ఏర్పాటు చేసుకోండి.

### సూర్యరశ్మికి ప్రత్యామ్నాయం ఉందా?

నిజానికి మనం తీసుకునే ఆహార పదార్థాల వల్ల శరీరానికి కావాల్సిన విటమిన్స్ లభిస్తాయి. కానీ డి-విటమిన్ విషయానికి వస్తే ఆహార పదార్థాల ద్వారా శరీరానికి ఈ విటమిన్ చాలా తక్కువగా లభిస్తుంది. అదీగాక విటమిన్-డి కలిగిన ఆహార పదార్థాలు కూడా చాలా తక్కువ. సాల్మన్, టూనా వంటి చేపల మాంసంలోనూ, ఫిష్ లివర్ ఆయిల్స్‌లోనూ విటమిన్-డి చాలా కొద్ది మోతాదులో లభిస్తుంది. అలాగే బీఫ్ లివర్, చీజ్, కొన్ని రకాల పుట్టగొడుగుల్లో కూడా కొంత వరకు విటమిన్-డి ఉంటుంది. విటమిన్-డి విషయంలో సూర్యరశ్మికి మించినది మరొకటి లేదు. అందుకే వైద్యులు కూడా కనీసం రోజులో 20 నిమిషాల సేపు ఎండలో ఉండాలంటున్నారు. అప్పుడే అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తపడవచ్చు.

# సంజీవిని గేమ్‌ఛేంజర్ పథకం

**ఆగస్ట్ 15 నుంచి అన్ని జిల్లాల్లో అమలు... మార్కాపురంను జిల్లా చేసి మాట నిలబెట్టాం**

**రైతులు సేంద్రియ వ్యవసాయం దిశగా సాగాలి**

**సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు**

**మార్కాపురం,జూన్ 28(ఆర్ఎన్ఎ):** ప్రజల అండ ఉంటే కొండనైనా ఢీ కొట్టే శక్తి తనకు వస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామన్నారు. కిష్టంశెట్టిపల్లిలో పర్యటించిన ఆయన.. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజలు ఆనందంగా ఉండేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం సంజీవని లాంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. సంజీవని పథకం ఒక గేమ్ ఛేంజర్ అని అన్నారు. ఆగస్టు 15 నుంచి అన్ని జిల్లాల్లో సంజీవని పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. యోగా, ధ్యానం వంటి మంచి అలవాట్లతో మీ ఆరోగ్యం.. మీ చేతుల్లోనే ఉంటుంది. పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలి.. తాజా ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు ఎరువులు తక్కువగా వాడాలి. యూరియా ఎక్కువ వేస్తే పంటను కొనేందుకు సిద్ధంగా లేరు. చాలా మంది ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. భవిష్యత్‌లో పెద్ద కుటుంబాలను ఆదరిస్తాం. ఇంటి కోసం, రేషన్ కార్డు కోసం పిల్లలు, తల్లిదండ్రుల నుంచి విడిపోతున్నారు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది. జనాభా పెరగాల్సిన అవసరం ఉంది. 40 ఏళ్ల తర్వాత ఏం జరుగుతుందో దాని గురించి ఇప్పుడే ఆలోచిస్తాను. నా కంటే ఇన్నోవేషన్ తెచ్చేవారు ఎవరూ ఉండరు. ఇటీవల జెన్ జీ... జెన్ జీ మాట ఎక్కువగా వినిపిస్తోంది. నేనే అందరికంటే పెద్ద జెన్‌జీని. నా కంటే ఇన్నోవేటివ్‌గా ఆలోచించేవారు ఎవరూ ఉండరు. ఇన్నోవేషన్‌తో ముందుకు వస్తే అండగా ఉంటానని అన్నారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. వెలిగొండ ప్రాజెక్టు.. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం. గొడ్డలి పార్టీకి మద్దతు ఇచ్చేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. అమరావతిపై వైకాపా కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. అమరావతిని నంబర్ 1 నగరంగా, రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి మా రాజధాని అని కాలర్ ఎగరేసి చెప్పుకొనేలా నిర్మిస్తాంఅని చంద్రబాబు అన్నారు. వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శలు గుప్పించారు. ప్రజల కోసమే కూటమి ఏర్పడిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. 3 వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామన్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని.. ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు. మనసున్న ప్రభుత్వం కాబట్టే ప్రజలకు అన్నీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెరిగాయని.. ప్రైవేటు స్కూళ్ల నుంచి లక్ష మంది ప్రభుత్వ బడుల్లో చేరారని తెలిపారు. అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కోసమే సంజీవని పథకాన్ని తీసుకొచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. ఎవరికైనా ఆరోగ్యం ఉంటేనే ఆనందమని.. సంజీవని ద్వారా వేగవంతంగా వైద్య సేవలు అందజేస్తామన్నారు. మన మిత్ర ద్వారా ఇంటి దగ్గరకే సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 'భవిష్యత్తులో పిల్లలే మన ఆస్తి. ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది' అని అన్నారు. ప్రతిఒక్కరూ క్వాంటమ్, ఎఐ నేర్చుకోవాలని సూచించారు. ఏపీకి పోలవరం జీవనాడి అని ముఖ్యమంత్రి తెలిపారు. వైసీపీ హయాంలో పోలవరాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. పనులు పూర్తికాకుండానే వెలిగొండను జాతికి అంకితం చేశారన్నారు. దిక్కుమాలిన పార్టీ.. గొడ్డలి పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. వైసీపీ పాలనలో మూడు ముక్కలాట ఆడారని మండిపడ్డారు. కుక్కతోక వంకర అన్నట్లు.. వైసీపీ బుద్ధి ఇంకా మారలేదన్నారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారంటూ ÷ర్ అయ్యారు. అమరావతిపై వైసీపీ కుట్రలు ఆగడంలేదన్నారు. మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట అంటూ వ్యాఖ్యానించారు. మన రాజధాని అమరావతి అని కాలర్ ఎగరేసే పరిస్థితి తీసుకొస్తామన్నారు. అమరావతిని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. నదుల అనసంధానం తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు. నీటి సమస్యలను అన్ని రాష్ట్రాలు కలిసి పరిష్కరించు కోవాలని సూచించారు. నదుల అనుసంధానమే అన్ని రాష్ట్రాలకు శ్రీరామ రక్ష అని తెలిపారు. వైసీపీ కుల రాజకీయాలు చేస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ సాయికృష్ణ కేసు అంశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లాగి కుట్రలు చేయాలని చూశారని ఆరోపించారు.

# పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

**బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎంపి ఇలాగేనా వ్యాఖ్యలు... అసదుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్,జూన్ 28(ఆర్ఎన్ఎ):** ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (÷ుసజీల। ఆనీఇ-బీప।నిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్‌పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు.



ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ పక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధృవీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించడానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందని, దేశంలోని ఇతర హైకోర్టులు కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాయని గుర్తుచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని లేదా నిబంధనను ప్రకటించలేదని, దేశ చట్టాలు, న్యాయస్థానాలు ఇప్పటికే స్పష్టం చేసిన పాత అంశాన్నే మరోసారి పునరుద్ఘాటిం చిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# తక్కువ ధరకు బంగారం అంటూ బురిడీ.... పారిపోతుండగా సూర్యాభాయ్ అరెస్ట్

**హైదరాబాద్,జూన్ 28(ఆర్ఎన్ఎ):** గోల్డ్ మ్యాన్ సూర్యభాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ అమాయకులను సూర్య భాయ్ బురిడీ కొట్టించాడు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే.. ఏకంగా బాధితులపై కేసు పెట్టాడు. చివరకు అసలు రంగు బయటపడటంతో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా గోల్డ్ మ్యాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తక్కువ ధరకే విదేశీ బంగారం ఇస్తానంటూ అమాయకుల నుంచి సూర్య భాయ్ లక్షలాది రూపాయలను వసూలు చేసి భారీ మోసానికి తెరతీశాడు. గోల్డ్ మ్యాన్ మాటలు నమ్మి హిమాయత్‌నగర్, నీలోఫర్‌కు చెందిన బాధితులు దాదాపు రూ.30 లక్షలు ఇచ్చారు. అయితే బంగారం ఇవ్వకపోవడంతో సూర్య ఇంటికి వెళ్లిన బాధితులు.. తమ డబ్బులు తమకు తిరిగి ఇచ్చేయాలని కోరారు. దీంతో తన వద్ద ఉన్న మూడు ఐఫోన్లను ఇచ్చి వాటి విలువ రూ.10 లక్షలు అని, అలాగే రూ.20 లక్షల చెక్ ఇచ్చి బాధితులను పంపించేశాడు.

అనంతరం బాధతులపైనే సూర్య భాయ్ తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేశాను. తనను బెదిరించి ఫోన్ లాక్కెల్లారంటూ సూర్య భాయ్ పోలీసులను తెలిపారు. ఈ విషయంలో లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు అసలు నిజామన్ని బయటపెట్టారు. తక్కువ ధరకే బంగారం పేరుతో సూర్య భాయ్ మోసం చేశారంటూ అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును నారాయణగూడకు బదిలీ చేశారు. అయితే అరెస్ట్ భయంతో సూర్య భాయ్ హైదరాబాద్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా షాద్‌నగర్‌లో పోలీసులు పట్టుకున్నారు.

## 60 లక్షల విలువైన 400 మొబైల్ ఫోన్ లు స్వాధీనం.

### బాధితులకు అందజేసిన కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు.



**మచిలీపట్నం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** దాదాపు 60 లక్షల విలువైన 400 మొబైల్ ఫోన్ లను మూడు నెలల కాలంలో రికవరీ చేసి రికార్డు సృష్టించడం అభినందనీయమని కృష్ణాజిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ నేటి ఆధునిక జీవితంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో విడదీయరాని భాగం అయిందన్నారు. వ్యక్తిగత సమాచారం బ్యాంకింగ్ సేవలు, విద్య, ఉద్యోగం వ్యాపారం, వంటి అనేక అవసరాలకు మొబైల్ ఫోన్ కీలక సాధనంగా మారిందని తెలిపారు. అలాంటి మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడం దొంగతనానికి గురికావడం లేదా ఇతర కారణాలతో కోల్పోవడం వల్ల బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు త్వరితగతిన సహాయం అందించాలని లక్ష్యంతో సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ను సమర్ధవంతంగా వినియోగిస్తూ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా పోగొట్టుకున్న దొంగిలించబడిన లేదా ఇతర కారణాలతో కోల్పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించేందుకు సీసీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం ఐటి కోర్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సీఇఆర్ పోర్టల్ ద్వారా ఐఎంఈఐ వివరాలను విశ్లేషించి వివిధ ప్రాంతాల్లో గుర్తించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందించడంలో విశేష కృషి చేస్తోందని కొనియాడారు. ఈ ప్రత్యేక చర్యల ఫలితంగా కేవలం మూడు నెలల కాలంలో మొత్తం 400 మొబైల్ ఫోన్లు సుమారు 60 లక్షల విలువైన వాటిని రికవరీ చేయడం జరిగిందన్నారు. వీటిలో మచిలీపట్నం సిసిఎస్ పరిధిలో 100, పెనమలూరు సిసిఎస్ పరిధిలో 63, గుడివాడ సిసిఎస్ పరిధిలో 237 మొబైల్ ఫోన్లను కనిపెట్టి రికవరీ చేయడం జరిగిందన్నారు. ఈ మొబైల్ ఫోన్లను కృష్ణాజిల్లా ఎస్పీ చేతులమీదుగా బాధితులకు అందజేశారు. ప్రజలు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్ లో కూడా వివరాలు నమోదు చేయాలన్నారు. దీంతో మొబైల్ ను బ్లాక్ చేయడంతో పాటు గుర్తించి తిరిగి అందించే ప్రక్రియ వేగవంతమవుతుందన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు కృష్ణా జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారన్నారు. మొబైల్ ఫోన్లు తిరిగి అందుకున్న బాధితులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమర్ధవంతమైన సేవలు అందిస్తున్న కృష్ణా జిల్లా పోలీసులను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ అభినందించారు.

## జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి సమన్వయంతో చర్యలు చేపట్టాలి.!

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



**మచిలీపట్నం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధితో పాటు ఎగుమతులను ప్రోత్సహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి), అనంతరం జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఈపిసి) సమావేశాలు నిర్వహించారు. డీఐఈపీసీ సమావేశంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమలకు సంబంధించిన అనుమతుల మంజూరు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపి) పురోగతి, పార్టనర్షిప్ సమ్మిట్--2025లో కుదిరిన అవగాహన ఒప్పందాల అమలు, జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ పునర్వ్యవస్థీకరణ, ఎంఎస్ఎంఈలకు వివిధ పారిశ్రామిక విధానాల కింద అందించే ప్రోత్సాహకాల మంజూరుపై సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను నిర్ణీత గడువులోగా మంజూరు చేసి, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జరిగిన డీఈపీసీ సమావేశంలో జిల్లా ఎగుమతుల గణాంకాలు, జిల్లా ఎగుమతుల కార్యాచరణ ప్రణాళిక, అధిక ఎగుమతి సామర్థ్యం కలిగిన ఉత్పత్తుల గుర్తింపు, భాగస్వామ్య సంస్థల సహకారం, ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాల విస్తరణ, ఎగుమతిదారుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. స్థానిక ఎంఎస్ఎంఈలు, కళాకారులు, రైతులు, పారిశ్రామికవేత్తలు ప్రపంచ మార్కెట్లను చేరుకునేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఎగుమతుల పెరుగుదల ద్వారా జిల్లాలో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేలా కార్యాచరణ ప్రణాళికను సమర్ధవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశాల్లో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, తపాల శాఖ మచిలీపట్నం డివిజన్ సూపరింటెండెంట్ బి శ్రీనివాసరావు, మల్లవల్లి పరిశ్రమల అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికుమార్, ఇమిటేషన్ జ్యువలరీ పార్క్ ప్రెసిడెంట్ సుబ్బారావు, ఇతర పారిశ్రామికవేత్తలు, అగ్నిమాపక శాఖ అధికారి ఏసురత్నం, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు జ్యోతి రమణి, జే జ్యోతి, బ్యాంకుల ప్రతినిధులు, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు



**కావలి జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పోలియోను నివారించేందుకు ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ రెండు చుక్కల పోలియో వాక్సిన్ వేయించాలని ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ చేవూరు చిన్నా అన్నారు. భవిష్యత్తులో భారత దేశాన్ని పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఆదివారం దళితవాడ అంగన్వాడీ కేంద్రం వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలను గుర్తించేందుకు ఆరోగ్య సిబ్బంది జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, చుక్కలు వేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం యం.రేవతి, ఆశా వర్కర్ సీహెచ్ సౌజన్య, అంగన్వాడీ వర్కర్స్ కె.విజయలత సీహెచ్.విజయ్ కుమారి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

## ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి: ఎమ్మెల్యే



**కనిగిరి జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. ఆదివారం కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఈ రోజు పిల్లలకు పోలియో చుక్కలు వేయించని వారు.. సోమ, మంగళవారాలు డోర్ టూ డోర్ క్యాంపెయిన్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరాలపై దాడులు



**కురుపాం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నవోదయం 2.0 లో భాగంగా ఆదివారం ఆంధ్ర- ఒడిశా సరిహద్దులో ఉన్న అనిజ, వనిజ పోలీసులు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 220 లీటర్ల నాటుసారాతో పాటు, 11 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి. శ్రీనివాసరావు తెలిపారు. నాటుసారాపై సరిహద్దులో నిరంతరం నిఘా పెడుతున్నామని, అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలు చేస్తున్నట్లు తెలిస్తే 63029 36599 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో విజయనగరం, సీతానగరం, చీపురుపల్లి, పార్వతీపురం ఎక్సైజ్, టాస్క్ ఫోర్సు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి కానుకగా వెండి బిందె అందజేత



**నిడదవోలు జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి కానుకగా వెండి బిందెను అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన పైడేటి సత్యనారాయణ - అలివేలు మంగతాయారు దంపతుల కుమారులు పైడేటి తేజ, లక్ష్మణ్ 1.062 కేజీల వెండి బిందెను ఆలయాధికారులకు అందజేశారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్వీకేఏ శర్మ, ఆలయ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమం




**భీమునిపట్నం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జీవీఎంసీ 4 వవార్డు పరిధి ప్రాంతంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో శ్రీ కనక మహాలక్ష్మి దేవాలయం డైరెక్టర్ టి డి పి సీనియర్ నాయకులు గరికిన.ఎల్లయ్య (కింగ్) పాల్గొని చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని పోలియో రహితంగా ఉంచడంలో పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసం యువత ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాంతీయ ఆసుపత్రి సేవలు అభినందనీయం: మంత్రి కొండపల్లి




**విజయనగరం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గజపతినగరంలోని ప్రాంతీయ ఆసుపత్రి సేవలు అభినందనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం పల్స్ పోలియో సందర్భంగా గజపతినగరంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 0-5 ఏళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. గజపతినగరం ఆసుపత్రి రాష్ట్రంలోనే నాలుగో స్థానాన్ని దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న గజపతినగరం వైద్య బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రిలో మాత్రమే చేసే మోకాలి చికిత్సను గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేసి నూతన ఒరవడిని సృష్టించారన్నారు. ఆసుపత్రిలోని పలు విభాగాలు పరిశీలించడంతోపాటు రోగులను పరామర్శించారు. మంత్రి వెంట తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాల రాజు, మక్కువ శ్రీధర్, ప్రదీప్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి



**కవిటి జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** శ్రీకాకుళం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జమేదారిపుట్టుగ వద్ద జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో బ్రహ్మపుర వెళ్లేందుకు ఆగి ఉంది. ఈ క్రమంలో పలాస వైపు నుంచి వస్తున్న లారీ ఆటోని ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు మురపాల పార్వతి, నర్తు పద్మమ్మ, మండపల్లి తరినమ్మగా గుర్తించారు. ప్రమాదంపై కవిటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలియో రహిత దేశమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి..!




**భీమునిపట్నం జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రజా ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, గంటా నూకరాజు అన్నారు. పల్స్ పోలియో సందర్భంగా భీమిలి జోన్ 3వ డివిజన్ బోయవీధి, ఎగువపేట, నేరెళ్లవలస కోలనీ, ప్రభుత్వ ఆసుపత్రిలలో జరిగే కార్యక్రమంలో గంటా నూకరాజు పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యులు కళ్యాణచక్రవర్తి, కల్యాణిలతో పాటు వైద్య సిబ్బందితో పాల్గొని 0-5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్య క్రమంలో ఏఎన్ఎమ్ భవానితో శ్రీ నూకాలమ్మ ధర్మకర్తల మండలి చైర్మన్ చురకల రమణ, తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకాలకు 'బ్లాక్ చెయిన్'



**కోటబొమ్మాళి, జూన్28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గతంలో రీసర్వే పేరుతో గొడ్డలి పార్టీ సృష్టించిన భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పట్టాదారు పాసు పుస్తకాలకు బ్లాక్ చెయిన్ సాంకేతికతను వర్తింపజేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. కోటబొమ్మాళి తహసీల్దారు కార్యాలయంలో కస్తూరిపాడు, దంత పంచాయతీల రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఉపయోగించిన తర్వాత పుస్తకం యజమాని అంగీకారం(ఓటీపీ) లేకుండా ఎలాంటి మార్పు చేయడానికి వీలుండదన్నారు. క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్ ఇలా ప్రతి అంశానికి యజమాని అవసరం ఉంటుందని వివరించారు. వైకాపా హయాంలో ప్రభుత్వ భూములని తెలిసినా ప్రైవేటు వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించేశారని మంత్రి ధ్వజమెత్తారు.భూహక్కు చట్టం ద్వారా రైతుల భూముల తనఖాకు సర్వం సిద్ధం చేయగా.. కూటమి విజయంతో దానికి అడ్డుకట్ట పడిందన్నారు. రాష్ట్రంలో ఇనాం భూముల సమస్యల పరిష్కారానికి జిల్లా నుంచే శ్రీకారం చుడతామన్నారు. అనంతరం తహసీల్దారు ప్రసాదరావు మంత్రిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆర్డీవో కృష్ణమూర్తి, రాష్ట్ర కళింగకోమట్ల కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు, కింజరాపు ప్రసాదరావు, పార్టీ మండలాధ్యక్షుడు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

## వ్యర్థ జలాలను చెరువులో వదలకుండా చర్యలు తీసుకోవాలి



**అనకాపల్లి జూన్ 28 మెట్రో వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామం ఆనుకొని 450 ఎకరాలు ఉప్పుటేరు ఉంది ఆ ఉప్పుటేరు లో హెట్రో డ్రగ్స్ కంపెనీ వారు వాడే వ్యర్థ రసాయన జలాలు నేరుగా చెరువులో కలపడం జరుగు తుంది. ఈ ఉప్పు టేరు మీదే రాజయ్య పేట, దొండవాక , జానకియ్యపేట, పెద్దతీనార్ల ,ఈ చుట్టుపక్కల ఉన్న గ్రామాలు అన్ని చెరువు పై వేటనిసేది సమయంలో ఆ రెండు నెలల్లో చెరువు మీద ఆధారపడి జీవన ఉపాధి సాగేది అదే విధంగా వర్షాకాలంలో కూడా దీని మీద ఆధారపడి బ్రతికేవాలు అలాంటి చెరువుని ఇప్పుడు హెట్రో యాజమాన్యం వారు ఈ చెరువుని డంపింగ్ యార్డ్ లాగా తయారు చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏదైతే ఈ వ్యర్థ రసాయన జలాలను వదులుతున్నారు ఆ వ్యర్థ జలాలను ఈ చెరువులో వదలకుండా చర్యలు తీసుకోవాలని సొంత నియోజకవర్గమైన హోమ్ మినిస్టర్ గారిని అదేవిధంగా పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ గారిని కలిసి వినతిపత్రం ఇవ్వడు జరుగుతుంది ఇందులో పాల్గొన్నవారు fdo పి శృతి గారు, విలేజ్ స్పెషల్ ఆఫీసర్ శివాజీ గారు, మైలపల్లి మహేష్ బాబు,కాళ్ళ దేముడు, మైలపల్లి బైరాగిరాజు, బొందలపు అప్పలరాజు, కోడా కాశీరావు తదితరులు పాల్గొన్నారు

# ఘట్టమనేని వారసుడి వెనుకడుగు ఎందుకంటే

ఘట్టమనేని మూడో తరం వారసుడు జయకృష్ణ డెబ్యూ మూవీ శ్రీనివాస మంగాపురం జూలై 9 విడుదలని మొన్నటి దాకా టీమ్ ప్రచారం చేస్తూ వచ్చింది. అయితే హఠాత్తుగా ప్రమోషన్లు ఆగిపోవడంతో పాటు ప్రీ రిలీజ్ ఈవెంట్ కు సంబంధించిన అప్డేట్స్ రాకపోవడంతో అభిమానుల్లో అనుమానం మొదలయ్యింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ సినిమా వాయిదా పడింది. జూలై చివరి వారం లేదా ఆగస్ట్ ఫస్ట్ వీక్ థియేటర్ రిలీజుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఇంకా అధికారిక ప్రకటన రాలేదు కాని ఒకవేళ నిజమైతే మటుకు మంచిదే అనుకోవాలి. ఎందుకంటే జూలై 10 లెనిన్ వస్తోంది. అన్నపూర్ణ, సితార సంస్థలు చాలా ప్రెస్టీజియస్ గా దీన్ని రిలీజ్ చేస్తున్నాయి. ట్రయిలర్ వచ్చాక అంచనాలు పెద్ద ఎత్తున పెరుగుతాయని అంటున్నారు. దీనికి వారం ముందు జూలై 3న రావు బహదూర్, నాగబంధం వస్తున్నాయి. కంటెంట్ పరంగా రెండూ మంచి హైప్ పెంచుకుంటున్నాయి. వీటి మధ్య జయకృష్ణ పోరాడాల్సి ఉంటుంది. దానికి తోడు కేవలం పది రోజుల వ్యవధిలో ఈవెంట్లు చేసి, బజ్ పెంచి ఓపెనింగ్స్ తెచ్చుకోవడం అంత సులభం కాదు. పైగా ఈవెంట్ కు వచ్చేందుకు మహేష్ బాబు కూడా అందుబాటులో లేరని టాక్. ఇంత పోటీ మధ్య ఇబ్బంది పడటం కంటే సేఫ్ గా మరోసారి రావడం మంచిదేనని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. గ్రౌండ్ లెవెల్ లో చూసుకుంటే శ్రీనివాస మంగాపురం మీద ఏమంత సౌండ్ లేదు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే కొంచెం లేట్ అవ్వడం ఒకరకంగా సేఫ్ గేమని చెప్పాలి. పైగా కొత్త హీరో హీరోయిన్, స్టార్ డైరెక్టర్ లేకపోవడం లాంటి అంశాలు మార్కెట్ పరంగా కొంత ప్రభావం చూపిస్తున్నాయి. మంగళవారం సక్సెస్ అయ్యింది కానీ మరీ పెద్ద స్థాయిలో కాదు. అందుకే అజయ్ భూపతి బ్రాండ్ కొంతమేర పని చేస్తోంది. మోహన్ బాబు కీలక పాత్ర పోషించిన ఈ లవ్ డ్రామా తిరుపతి బ్యాక్ డ్రాప్ లో జరుగుతుంది. లవ్ స్టోరీ అయినప్పటికీ కమర్షియల్ ఎలిమెంట్స్ కి లోటు లేకుండా జాగ్రత్త వహించారట. జివి ప్రకాష్ కుమార్ దీనికి సంగీతం సమకూర్చారు.






## బుచ్చిబాబు అడుగులు ఎటు వెళ్తాయి



పెద్ది థియేటర్ రన్ ఈ సండేతో ముగిసినట్టే. నాలుగో వారంలో ఓ మోస్తరుగా ఆడుతోంది కానీ వీక్ డేస్ లో చెప్పుకోదగ్గ వసూళ్లు లేవు. మా ఇంటి బంగారం అనూహ్యంగా హిట్ కావడం పెద్దికి మైనస్ అయ్యింది. రామ్ చరణ్ లండన్ వెళ్లి అక్కడ ప్రమోషన్లలో బిజీగా ఉన్నాడు. ముందే ప్లాన్ చేసుకున్న షెడ్యూల్ కావడంతో దానికి అనుగుణంగా టూర్ కొనసాగుతోంది. ఇప్పుడు అందరి చూపు దర్శకుడు బుచ్చిబాబు మీదకు వెళ్తోంది. నెక్స్ట్ ఎవరితో చేస్తారనే ప్రశ్న ఆసక్తి రేపుతోంది. ఉప్పెన తర్వాత ఏకంగా ఐదేళ్ళు గ్యాప్ రావడం బుచ్చిబాబు మైనస్ గా ఫీలవ్వలేదు. ఎందుకంటే రామ్ చరణ్ తనను నమ్మి పెద్ది లాంటి భారీ ఆఫర్ ఇవ్వడం వల్ల. అంతేకాదు కథ డిమాండ్ మేరకు ఒళ్ళు హూనం చేసుకున్నాడు. విపరీతంగా కష్టపడ్డాడు. మూడు వందల కోట్లకు పైగా వసూళ్లు రావడంలో తనవంతు బాధ్యత పూర్తిగా నెరవేర్చాడు. కానీ ఓవర్సీస్, బాలీవుడ్, కేరళ తమిళనాడులో ఆశించిన ఫలితం రాకపోవడం బుచ్చిబాబు బ్రాండ్ మీద ప్రభావం చూపించింది. ఎందుకంటే రాజమౌళి, ప్రశాంత్ నీల్, రిషబ్ శెట్టి, సుకుమార్ లాంటి స్టార్ డైరెక్టర్లు హిందీలోనూ తమ జెండా పాతారు. బుచ్చిబాబు పెద్దితో ఈ లీగ్ లోకి వెళ్లిపోవచ్చని భావించారు. కానీ అలా జరగలేదు. మహేష్ బాబు తనతో చేయడం పట్ల ఆసక్తిగా ఉన్నాడనే ప్రచారం జరిగింది. కానీ వారణాసి తప్ప వేరే ప్రపంచం లేదన్నట్టు బిజీగా ఉన్న సూపర్ స్టార్ ఇప్పుడప్పుడే కథలు వినే ఉద్దేశంలో లేరట. సో ఎంతలేదన్నా ఇంకో ఏడాది వెయిటింగ్ ఎవరికైనా తప్పదు. విచిత్రంగా ఇప్పుడు బుచ్చిబాబు ముందు ఉన్న ఆప్షన్లు తక్కువే. జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, అల్లు అర్జున్, నాని ఇంకో రెండు మూడు సంవత్సరాల వరకు దొరికేలా లేరు. పోనీ రామ్ చరణ్ ని మళ్ళీ ట్రై చేద్దామన్నా గురువు సుకుమార్ లాక్ చేసుకున్నారు. సో ఛాన్స్ లేదు. మీడియం రేంజ్ హీరోతో చేస్తే ఇమేజ్ తగ్గే రిస్క్ లేకపోలేదు. ఈ మీమాంసలో బుచ్చిబాబు ఇంకొంత కాలం వేచి చూసే ధోరణిలో ఉన్నట్టు తెలిసింది. తన టీమ్ ని ఖాళీగా ఉంచకుండా ఏకకాలంలో రెండు కథల మీద వర్క్ చేయిస్తున్నారట.

# కోట్లు పెట్టినా రాని పబ్లిసిటీ... టైటిల్‌తో



చిన్న సినిమాలను జనాల్లోకి తీసుకెళ్లడం, థియేటర్లకు రప్పించడం ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది. క్రేజీ ప్రమోషనల్ కంటెంట్‌తో వస్తే తప్ప ప్రేక్షకుల చూపు వాటి మీద పడదు. చిన్న చిత్రాల పబ్లిసిటీ కోసం కొందరు కావాలని వివాదాలు రాజేయడమూ చూస్తున్నాం. కానీ ఇప్పుడో సినిమా టైటిల్ విషయంలో అనుకోకుండా తలెత్తిన వివాదం దానికి వరంగా మారింది. షూటింగ్ కూడా మొదలు కాకముందే ఆ చిత్రానికి కావాల్సినంత పబ్లిసిటీ వచ్చింది. ఆ చిత్రమే.. ఇడుపు కాయితం. సుకుమార్, బన్నీ వాసు కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి, యూట్యూబ్ స్టార్ నాగదుర్గ ఇందులో జంటగా నటిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రానికి ముహూర్త వేడుక నిర్వహించి.. టైటిల్, ఫస్ట్ లుక్ లాంచ్ చేశారు ఐతే 'ఇడుపు కాయితం' అన్న టైటిల్ చాలామందికి అర్థం కాలేదు. తెలంగాణ పల్లెటూళ్లలో విడాకుల పత్రాన్ని వాడుకు భాషలో 'ఇడుపు కాయితం' అంటారు. ఆంధ్ర వాళ్లకే కాదు.. తెలంగాణ అర్బన్ ఏరియాల వాళ్లకు కూడా ఈ టైటిల్ అర్థం కాలేదు. ఐతే భాషలో మరుగునపడ్డ ఎన్నో పదాలు ఉంటాయి. వాటిని ఇలా పరిచయం చేయడం, జనాలకు అలవాటు చేయడం మంచిదే. ఐతే ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు సోషల్ మీడియాలో ఈ టైటిల్ మీద వెటాకారాలడడం.. ఈ సినిమాకు సబ్ టైటిల్స్ పెడతారా అంటూ కౌంటర్లు వేయడంతో వివాదం మొదలైంది. దీని మీద తెలంగాణ వాళ్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నటుడు రాహుల్ రామకృష్ణ లాంటి ప్రముఖులు కూడా దీనిపై విమర్శలు గుప్పించారు. ఇది ప్రాంతీయ విద్వేషాలకు, విభేదాలకు దారి తీసే స్థాయిలో వివాదంగా మారింది. ఐతే అచ్చమైన తెలంగాణ పల్లెటూరి కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో హీరోయిన్లు, దర్శకుడు తెలంగాణ వారు కాగా.. దాన్ని నిర్మిస్తోంది ఇద్దరు ఆంధ్రులు అన్న సంగతి మరువరాదు. టైటిల్ మీద వెటకారాలాడడం కచ్చితంగా తప్పే. కానీ సోషల్ మీడియాలో ఎవరో చేసిన పిచ్చి కామెంట్ల మీద ఇంత గొడవ కూడా అవసరం లేదు. ఈ గొడవకు ఇంతటితో తెరదించాల్సిన అవసరముంది. ఈ వివాదం వల్ల చిత్ర బృందానికైతే బాగానే లాభం జరిగింది. కోట్లు పెట్టినా రాని పబ్లిసిటీ వచ్చింది. ఓపెనింగ్స్‌కు ఇది బాగా కలిసొస్తుందనడంలో సందేహం లేదు. సినిమాలో విషయం ఉంటే.. 'బలగం'లా అందరి మన్ననలూ పొందవచ్చు.



# బిజినెస్ న్యూస్



## విండోస్ 10 యూజర్లకు మైక్రోసాఫ్ట్ మరో ఏడాది ఊరట



విండోస్ 10కు గతేడాది మైక్రోసాఫ్ట్ తన సపోర్ట్ నిలిపివేసింది. విండోస్ 11కు హార్డ్‌వేర్ సపోర్ట్ చేయని వారు ఎక్స్‌టెండ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్‌లో చేరాలని అప్పట్లో సూచించింది. లేదంటే కొత్త డివైజ్‌కు మారాలని పేర్కొంది. వాస్తవానికి ఆ గడువు కూడా ఈ ఏడాది అక్టోబర్‌తో ముగియనుంది. ఈ క్రమంలో విండోస్ 10 యూజర్లకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. ఈఎస్‌యూ ప్రోగ్రామ్‌ను మరో ఏడాది పాటు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. దీంతో కొత్త ఆపరేటింగ్ సిస్టమ్‌కు మారలేక, కొత్త పీసీకి అప్‌గ్రేడ్ అవ్వలేని వారికి ఉపశమనం కల్పించినట్లు అయ్యింది. ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్ కింద విండోస్ 10 కస్టమర్లు మరోఏడాది పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ అందుకుంటారంటూ మైక్రోసాఫ్ట్ తన సపోర్టు పేజీలో రాసుకొచ్చింది. అంటే 2027 అక్టోబర్ వరకు సెక్యూరిటీ అప్‌డేట్స్ వస్తాయన్నమాట. ఇప్పటికే ఈఎస్‌యూలో చేరిన యూజర్లు.. కొత్తగా చేయాల్సింది ఏమీ ఉండదు. వాస్తవానికి మైక్రోసాఫ్ట్ విండోస్ 10ను లక్షలాది మంది వినియోగిస్తున్నారు. వారంతా 11కు అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలన్నది మైక్రోసాఫ్ట్ లక్ష్యం. ఏదైనా కారణం చేత విండోస్ 10లోనే కొనసాగాల్సి వస్తే.. డబ్బులు పెట్టి ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ (ఙూఖ) ప్రోగ్రామ్ కింద సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు ఈ ఈఎస్‌యూ ప్రోగ్రామ్‌లో కేవలం సెక్యూరిటీ అప్‌డేట్స్ మాత్రమే లభిస్తాయి. కొత్త ఫీచర్లు గానీ, డిజైన్ మార్పిడి రిక్వెస్టులు గానీ, నాన్ సెక్యూరిటీ రిక్వెస్టులు గానీ అందించదు.

## ఫ్లిప్‌కార్ట్ 'గోట్‌సేల్'.. ఐఫోన్ 17 సిరీస్‌పై భారీ డిస్కౌంట్స్




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ 'గోట్ సేల్' జులై 4న ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఐఫోన్‌లపై భారీ ఆఫర్లను ప్రకటించింది. ఐఫోన్ కొనుగోలు చేయాలనుకునే యూజర్లకు ఇది బంపర్ ఆఫర్‌గా మారనుంది. ఐఫోన్17 పై రూ.12 వేలు, ప్రో మోడల్స్‌పై రూ.22 వేల వరకు డిస్కౌంట్‌లను ఇస్తోంది. మెమొరీ చిప్ కొరత వల్ల రానున్న రోజుల్లో ఐఫోన్ ధరలు పెరిగే అవకాశం ఉన్నందున..ఈ సేల్ మంచి అవకాశం.

ఆఫర్‌లో భాగంగా..

ఐఫోన్ 17 రూ.82,900 ధరతో లాంచ్ అవ్వగా.. సేల్‌లో భాగంగా రూ.70,990కే పొందొచ్చు. అంటే రూ.12 వేల డిస్కౌంట్.

ఐఫోన్ 17 ప్రో ధర రూ.1,34,900 నుంచి ప్రారంభమవ్వగా.. సేల్‌లో రూ.1,12,900కు లభిస్తుంది. గరిష్ఠంగా రూ.22 వేల డిస్కౌంట్‌తో వస్తోంది.

ఈ సేల్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ఐఫోన్ 17 ప్రో మాక్స్. రూ.22 వేల డిస్కౌంట్‌తో రూ.1,27,900కు సొంతం చేసుకోవచ్చు.

ఐఫోన్ 17ఈ ధర రూ.60,900, ఐఫోన్ ఎయిర్ ధర రూ.95,900, ఐఫోన్ 16 ధర రూ.59,900, ఐఫోన్ 16 ప్లస్ ధర రూ.73,900, ఐఫోన్ 16ఙు ధర రూ.55,900, ఐఫోన్ 15 ధర రూ.49,900 నుంచి ప్రారంభం కానున్నాయి.

అదనంగా బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ బోనస్, నో-కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ల ద్వారా ఐఫోన్ ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌ఎస్‌బీసీ క్రెడిట్ కార్డు హోల్డర్స్‌కు 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభించనుంది.

కొత్తగా ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్‌కార్డు తీసుకునేవారికి రూ.3 వేల వెల్‌కమ్ వోచర్లు లభిస్తాయి. ప్లస్ లేదా బ్లాక్ మెంబర్స్‌కు 24 గంటల ముందే (జులై 3) గోట్ సేల్ ఎర్లీ యాక్సెస్ పొందవచ్చు.

## ఆధార్, క్రెడిట్ కార్డులు.. జూలై 1 నుంచి కీలక మార్పులు



వచ్చే జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా పలు కీలక ఆర్థిక మార్పులు అమల్లోకి రానున్నాయి. ఇవి ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ఆధార్ కార్డుదారులు, క్రెడిట్ కార్డు వినియోగదారులు, పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులు, బ్యాంకు ఖాతాదారులపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా ఆధార్‌లో ఈమెయిల్ అప్‌డేట్‌కు ఉచిత అవకాశం, క్రెడిట్ కార్డుల రివార్డ్ పాయింట్లు, లాంజ్ యాక్సెస్ నిబంధనల్లో మార్పులు, పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు, బ్యాంకుల మిస్-సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి.

**ఐటీఆర్ దాఖలుకు జూలై 31 చివరి తేదీ**

2025-26 ఆర్థిక సంవత్సరానికి (అసెస్‌మెంట్ ఇయర్ 2026-27) సంబంధించిన ఐటీఆర్-1, ఐటీఆర్-2 రిటర్నులు దాఖలు చేయడానికి జూలై 31, 2026 చివరి గడువు. గడువు దాటితే ఆలస్య రుసుములు, కొన్ని పన్ను విధానాలను ఎంచుకునే అవకాశాలపై పరిమితులు, అర్హత ఉన్న నష్టాలను తదుపరి సంవత్సరాలకు క్యారీ ఫార్వర్డ్ చేయడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

**ఆధార్‌లో ఈమెయిల్ అప్‌డేట్**

యూఐడీఏఐ కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఆధార్ మొబైల్ యాప్ ద్వారా నమోదిత ఈమెయిల్ చిరునామాను అప్‌డేట్ చేసుకునే సేవను పూర్తిగా ఉచితంగా అందించనుంది. దీని కోసం ఇప్పటి వరకు రూ.75 రుసుము ఉండేది. అయితే ఈ రాయితీ కేవలం అధికారిక ఆధార్ మొబైల్ యాప్ ద్వారా చేసే అప్‌డేట్‌లకే వర్తిస్తుంది.

**ఎస్‌బీఐ కార్డుల రివార్డ్ నిబంధనల్లో మార్పులు**

ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ాఖ౯ాజు, ాజుాజుజు దీూాజఖ కార్డులకు సంబంధించిన రివార్డ్ పాయింట్ల విధానంలో మార్పులు అమల్లోకి రానున్నాయి. రివార్డ్ పాయింట్లు పొందే లావాదేవీలపై కొత్త పరిమితులు విధించడంతో పాటు, పాయింట్లు లభించని లావాదేవీల జాబితాను కూడా విస్తరించారు.

**హెచ్‌డీఎఫ్‌సీ లాంజ్ యాక్సెస్**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్ కార్డుదారులు ప్రతి క్యాలెండర్ త్రైమాసికంలో మూడు ఉచిత దేశీయ విమానాశ్రయ లాంజ్ సందర్శనలను పొందాలంటే, అంతకుముందు త్రైమాసికంలో కనీసం రూ.60,000 ఖర్చు చేసి ఉండాలి. ఉదాహరణకు జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి లాంజ్ సదుపాయం పొందాలంటే ఏప్రిల్-జూన్ మధ్య ఈ ఖర్చు పూర్తిచేయాల్సి ఉంటుంది.

**పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు**

జూలై 1 నుంచి సాధారణ, తత్కాల్ పాస్‌పోర్ట్‌ల ఫీజులు పెరుగుతున్నాయి. తాజా నోటిఫికేషన్ ప్రకారం 36 పేజీల సాధారణ పాస్‌పోర్ట్ ఫీజు రూ.1,500 నుంచి రూ.2,500కు, తత్కాల్ ఫీజు రూ.3,500 నుంచి రూ.5,000కు పెరిగింది. ఇతర కేటగిరీల ఫీజులను కూడా కేంద్ర ప్రభుత్వం సవరించింది.

**బ్యాంకుల మిస్-సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కఠిన చర్యలు**

బ్యాంకులు ఆర్థిక ఉత్పత్తులను తప్పుదోవ పట్టిస్తూ విక్రయించే ఘటనలను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను అమల్లోకి తెస్తోంది. ఈ నిబంధనల ప్రకారం మిస్-సెల్లింగ్‌కు గురైన వినియోగదారులు పూర్తి రీఫండ్‌తో పాటు జరిగిన నష్టానికి తగిన పరిహారం పొందే హక్కు కలిగి ఉంటారు. బ్యాంకులు ఉత్పత్తుల విక్రయంలో మరింత పారదర్శకత పాటించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు కూడా జూలై 1 నుంచే అమల్లోకి వస్తాయి.

## 150 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు షాక్.. అందరూ లేఆఫ్

అమెరికాకు చెందిన రిటైల్ టెక్నాలజీ సంస్థ హై-వీ (ఎఎ-ఎవవ) భారత్‌లోని తన ఇంజినీరింగ్ సెంటర్‌ను ఆకస్మికంగా మూసివేయడంతో సుమారు 150 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఒక్కరాత్రిలోనే ఉద్యోగాలు కోల్పోయారు. ఉద్యోగులను రాత్రి 9 గంటలకు మైక్రోసాఫ్ట్ టీమ్స్ వీడియో కాల్‌కు ఆహ్వానించిన సంస్థ, రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా భారత ఇంజినీరింగ్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఉద్యోగులకు ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే వారి కార్పొరేట్ యాక్సెస్ కూడా నిలిపివేయబడింది. ఈ ఘటనపై మాజీ ఉద్యోగి ఒకరు రెడ్డిట్‌లో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఇంటర్న్‌గా చేరి దాదాపు రెండేళ్లలో పూర్తి స్థాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎదిగిన తాను, "ఒక్క సమావేశంతో అంతా ముగిసిపోయింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా సంస్థ నుంచి సెవరెన్స్ ప్యాకేజీ లేదా ఎటువంటి ఆర్థిక పరిహారం కూడా అందలేదని పేర్కొన్నాడు. రియాక్ట్, నోడ్ జేఎస్, జావా స్క్రిప్ట్, టైప్ స్క్రిప్ట్ వంటి టెక్నాలజీల్లో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ, ఒక్కసారిగా ఉద్యోగం కోల్పోవడం తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసిందని తెలిపాడు. ఈ అకస్మాత్తు తొలగింపులపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ఉద్యోగులకు కనీస నోటీసు లేకుండా మొత్తం టీమ్‌ను తొలగించడం చట్టబద్ధమేనా? అనే ప్రశ్నలు నెటిజన్లు లేవనెత్తుతున్నారు. కొందరు ఉద్యోగుల ఆరోపణల ప్రకారం, తొలగింపుల అనంతరం సంస్థ భారత విభాగానికి సంబంధించిన లింక్డ్ఇన్ పేజీతో పాటు పలు పోస్టులను కూడా తొలగించినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలపై సంస్థ అధికారికంగా స్పందించలేదు.

## పల్స్ పోలియో కార్యక్రమానికి దివిస్ సహకారం ...



**భీమునిపట్నం జూన్ 28 నేటి మనదేశమ్ :** భీమిలి ప్రాంతంలో ప్రభుత్వ వైద్యులు మరియు వైద్య సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు భీమిలి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, తగరపువలస అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, తాళ్లవలస ప్రైమరీ హెల్త్ సెంటర్, భీమిలి కో లోకేటెడ్ ప్రైమరీ హెల్త్ సెంటర్, చేపలు ప్పాడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమానికి హాజరైన 450 మంది ఇమ్మ్యునైజర్లకు దివిస్ వారు భోజనం మరియు త్రాగునీరు అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి కళ్యాణి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ కళ్యాణ కృష్ణ, ఈవో రాజ్ కుమార్, డిఇఓ లు నాగబాబు, హారిక, రాముడమ్మ, దేవి, దివిస్ సిబ్బంది ఏ శ్రీనివాస్, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

## హెచ్ఐవి మరియు గొంతు క్యాన్సర్‌తో పోరాడుతున్న అనూషకు ఆశాకిరణంగా నిలిచిన ఆయుర్‌జీవా ఫౌండేషన్




**విశాఖపట్నం జూన్ 28 నేటి మనదేశమ్ :** మానవత్వమే మహోన్నతమైన సేవ అనే సంకల్పంతో AYUR JEEVA FOUNDATION మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. ఈరోజు HIV మరియు గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న అనూషకు ఆర్థిక, పోషక మరియు నిత్యావసర సహాయాన్ని అందిస్తూ ఆమెకు ధైర్యం, ఆశను కల్పించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా రూ.4,000 ఆర్థిక సహాయం, రూ.1,000 విలువైన పోషకాహార కిట్, వస్త్రాలు, అలాగే గత నెలలో ఆమె కోరిన శానిటరీ న్యాప్కిన్లు అందజేశారు.

గత నెలలో AYUR JEEVA FOUNDATION అందించిన పోషకాహార పదార్థాలతో ఆరోగ్యకరమైన న్యూట్రిషన్ పౌడర్ తయారు చేసుకుని వాడుతున్నానని అనూష తెలిపింది. ఆ పోషకాహారం వల్ల తన ఆరోగ్యంలో కొంత మెరుగుదల కనిపించిందని, మునుపటి కంటే ఇప్పుడు కొంత స్పష్టంగా మాట్లాడ గలుగుతున్నానని ఆనందం వ్యక్తం చేసింది.

ఈ క్లిష్ట సమయంలో తనకు అండగా నిలిచిన AYUR JEEVA FOUNDATIONకు ఆమె హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ సందర్భంగా AYUR JEEVA FOUNDATION వ్యవస్థాపకురాలు దాసరి సుబ్బలక్ష్మి మాట్లా డుతూ, అనూష ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడే వరకు ఫౌండేషన్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు.

డిగ్రీ వరకు విద్యను పూర్తి చేసిన అనూషకు, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఆమె విద్యార్హతలకు తగిన గౌరవప్రదమైన ఉద్యోగాన్ని కల్పించేందుకు కూడా ఫౌండేషన్ ప్రత్యేకంగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

## 34 లక్షల రూపాయలతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**కొయ్యూరు, జూన్ 28 నేటి మనదేశమ్ :** మండలంలో, రత్నం పేట గ్రామంలో, 34 లక్షల రూపాయలతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన , మాజీ సర్పంచ్ లింగేటి శంకర్రావు, తెదేపా,మండల పార్టీ, ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, లు శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పాడేరు నియోజకవర్గ ఇంఛార్జి మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు కూటమి నాయకులతో కలిపి కార్యక్రమం నిర్వహించమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో మండలంలో చింతలపూడి. మూలపేట. రత్నంపేట. బాలారం. బట్ట పనుల. కినపర్తి. పంచాయతీలలో పంచాయతీ బిల్డింగులు మంజూరు అయి పనులు జరుగుతున్నవి కూటమి ప్రభుత్వంలో ఇంఛార్జి గిడ్డి ఈశ్వరి గారి ఆధ్వర్యంలో మారు మూల ప్రాంతాల్లో రోడ్లు. స్కూల్ బిల్లింగ్ లు. పంట కాలువ పనులు ముమ్మరంగా జరుగుతున్నవి ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ డైరెక్టర్లు

కూనిశెట్టి జోగారావు.బిజెపి నాయకులు, రిమల చంద్రరావు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు. గర్రెంగి రాజేశ్వరి. బండారు సాంబమూర్తి. కిని బేరి వరలక్ష్మి. మండల ఉపాధ్యక్షురాలు గాం రమాదేవి. నక్క రాంబాబు. ఐ టి డి పి జోగేంద్ర. కో క్లస్టర్ స్వాతి కుమార్. గిరిజన మోర్చా అరిమెల రాజు. లోతా సింహాచలం. పాంగి భీమరాజు. గ్రామస్తులు మహిళలు పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## బజ్జీలు తినడంతో ఫుడ్‌పాయిజన్.. 23 మందికి అస్వస్థత



**కొయ్యూరు, జూన్ 28 నేటి మనదేశమ్ :** తూర్పుగోదావరి జిల్లా కాజులూరు మండలంలోని దుగ్గుదూరు గ్రామంలో ఫుడ్ పాయిజన్ జరిగి 23 మంది అస్వస్థతకు గుర య్యారు. రహదారి పక్కన బండిలో విక్ర యించే బజ్జీలు తినడంతో వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో ఆసుపత్రిలో చేరారు. దుగ్గుదూరు పీహెచ్‌సీలో కొందరు చికిత్స పొందు తుండగా.. మరికొందరు డిశ్చార్జి అయ్యారు.

# పీవీ జయంతి, వర్ధంతి ని అధికారికంగా జరపాలి : జివిఎల్

**- దేశం విడిచిన మేధావులు తిరిగి భారత్ కు రావాలి: ఎంపీ భారత్**

**- విశాఖ లో బ్రాహ్మణా సంఘాలచే ఘనంగా పీవీ 105 జయంతి వేడుకలు**



**విశాఖపట్నం, జూన్ 28 నేటి మనదేశమ్ :** ప్రపంచ స్థాయిలో భారత కీర్తిపతాకను ఉన్నతంగా నిలిపి భారత మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహారావు జయంతిని, వర్ధంతిని ప్రభుత్వం అధికారంగా జరపాలని మాజీ ఎంపీ జివిఎల్ నరసింహారావు పిలుపునిచ్చారు. ఆదివారం విశాఖలోని అఖిల బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక నిర్వహణలో పీవీ 105 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని లోక్ సభ సభ్యులు ఎం. శ్రీ భారత్, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, సుహాసిని ఆనంద్ ( బీజీపీ), బొత్స ఝాన్సీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ( వైఎస్సార్ కాంగ్రెస్), పివి కి ఎస్ డి ఓ గా ఆరేళ్ళు పనిచేసిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జివిఎల్ మాట్లాడుతూ తానూ పీవీ ని ప్రత్యక్షంగా ఒక్కసారే కలిసినట్టు తెలిపారు. అయితే భారత ప్రధానమంత్రి గాను, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి గానూ, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా చేసిన ఏకైక తెలుగు వ్యక్తి పీవీ అన్నారు. ఈయన దేశానికి చేసిన సేవలకు గుర్తింపు గాను ఆయనకు భారత రత్న పురస్కారం ఇచ్చి గౌరవించిన ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ మాత్రమే నన్నారు. రాజకీయంగా బద్ద విరోదంగా ఉన్నప్పుడికి వారికి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందించడం జరిగిందన్నారు. ఆర్ధిక సంస్కరణల ద్వారా ఈ భారత దేశ గతిని పూర్తిగా మారేశారన్నారు. ఒక వ్యక్తి మాతృ భాష కాకుండా మరొక భాష నేర్చుకోవడమే అత్యంత కష్టతరమని, అలాంటిది పీవీ ఏకంగా 16 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన నేర్పరి అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయినా పీవీ నేటి తరానికి మార్గదర్శి అన్నారు. విశాఖ ఎంపీ శ్రీ భారత్ మాట్లాడుతూ పీవీ ప్రభుత్వానికి ముందు ఉన్న ఆర్ధిక విపత్తుల ఫలితంగా విదేశాలకు వెళ్ళిపోయిన మేధావులు ( మేధో మధనం ) భారత్ కు తిరిగి రావాలి ని పిలుపునిచ్చారు. సాధారణ రైతు కుటుంబం నుంచి ప్రపంచం మెచ్చిన ఆర్ధిక సంస్కరణల మేధావిగా ఎదిగిన పీవీ స్ఫూర్తిగా నేటి యువతరం ఎదగాలని, తద్వారా భారత్ ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన స్థితికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమానికి ముందుగా పీవీ నరసింహారావు వద్ద ప్రత్యేక అధికారిగా ఆరేళ్ళు పనిచేసిన ప్రసాద్ పీవీ జీవన శైలి, ఆలోచన, కార్యాచరణ విధానాలని వివరించారు. ప్రతిపక్ష నేతలైన అటల్ బిహారి వాజపేయి, అద్వానీ, ఇతర ముఖ్య నేతలు అందరితోనూ స్నేహ పూర్వక అనుబంధాన్ని కొనసాగించారని తెలిపారు. తన సొంత భూమి 80 ఎకరాలను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించిన ధీశాలి పీవీ అని తెలిపారు. విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, సుహాసిని ఆనంద్ ( బీజీపీ), బొత్స ఝాన్సీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ్ (వైఎస్సార్ కాంగ్రెస్) తదితరులు పీవీ ఈ దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. వారిని కొనియాడడంతో పాటు, వారిని స్ఫూర్తిగా తీసుకుని దేశ సేవ చెయ్యాలని పిలుపునిచ్చారు.

**పీవీ విగ్రహానికి సంయుక్తంగా ఘన నివాళి :**

అంతకు ముందు సిరిపురం లోని సర్క్యూట్ హౌస్ కూడలి వద్దగల పీవీ విగ్రహానికి ఎంపీ భారత్, మాజీ ఎంపీ జివిఎల్ నరసింహారావు, గాజువాక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావులు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ లు సంయుక్తం గా భారీ పూలమాల వేసి, ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమం లో వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సంఘం ప్రతినిధులు కావూరి చరణ్ కుమార్, పీవీ జయంతి వేడుకల కమిటీ చైర్మన్ కె నరసింహ మూర్తి, వైజాగ్ బ్రాహ్మణ జె ఏ సి కన్వీనర్ కిరణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలు ప్రముఖ న్యాయవాది కె. నరసింహ మూర్తి అధ్యక్షతన జరిగాయి. విశాఖ నగరం లోని అన్ని బ్రాహ్మణ సంఘాలు, అర్చక పురోహిత, మీడియా వర్గాలు, యువజన సంఘాలు, తదితర ప్రతినిధుల సంపూర్ణ సహకారంతో పీవీ జయంతి వేడుకలను విజయవంతంగా జరిగినట్టు నిర్వాహక కమిటీ తెలియచేసింది. ఈ వేడుకల్లో విశాఖ లోని వివిధ బ్రాహ్మణా సంఘాల కుటుంబ సభ్యులు, పీవీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు వేయిద్దాం - భావి తరాన్ని కాపాడుదాం

### - డాక్టర్ కందుల నాగరాజు



**విశాఖపట్నం, జూన్ 28 నేటి మనదేశమ్ :** ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయిస్తే అంగవైక్యల్యాన్ని అధిగమించవచ్చని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ , జనసేన నాయకులు డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. స్థానిక 32వ వార్డు అల్లిపురం, నేరేళ్ల కోనేరు వద్ద నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పిల్లలకు ఇప్పటికే సాధారణ టీకాలు అన్నీ పూర్తయినప్పటికీ, పల్స్ పోలియో కార్యక్రమాల్లో ఇచ్చే అదనపు డోసులు వారిని పోలియో మహమ్మారి నుండి సంపూర్ణంగా రక్షించడానికి ఎంతో అవసరమని చెప్పారు. సాధారణ టీకాలతో పాటు పల్స్ పోలియో చుక్కలు అదనపు రోగనిరోధక శక్తిని అందిస్తాయన్నారు. సమాజంలో పోలియో వైరస్ వ్యాప్తి చెందకుండా అడ్డుకోవడానికి ఇది ఒకేసారి అందరికీ వేయించడం ముఖ్యమని తెలిపారు. ఈ చుక్కలు ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రత్యేక పోలియో బూత్‌ల ద్వారా పూర్తిగా ఉచితంగా, సురక్షితంగా ఇవ్వబడతాయన్నారు.మీ పిల్లలకు జలుబు, జ్వరం లేదా ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ పోలియో చుక్కలు వేయించవచ్చన్నారు.అయితే ఏదైనా సందేహం ఉంటే స్థానిక డాక్టర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. పుట్టిన శిశువుల నుండి ఐదు సంవత్సరాల వయస్సు నిండే వరకు ప్రతి శిశువుకూ ఈ డ్రాప్స్ తప్పనిసరిగా ఇప్పించాలన్నారు. జూన్ 29, 30 తేదీల్లో కూడా ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేసేందుకు వైద్య సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసారని అన్నారు.రెండు చుక్కల పోలియో మందు వేయించడం ద్వారా పిల్లలకు ఆరోగ్య రక్షణ లభిస్తుందన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. అందరి సహకారం తోనే పోలియోరహిత సమాజం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం. కే.విజయలక్ష్మి, ఏ.డబ్ల్యూ,డబ్ల్యూ, టి.పార్వతి, ఎల్.ప్రసన్న, ఎస్.మౌనిక, కే.కృష్ణ, కే.అప్పారావు, సిపిఐ బుజ్జి, కే.ఎన్.ఆర్ ఫాలోవర్స్ పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు పల్స్ పోలియో 2026 కార్యక్రమంలో పాల్గొన్న

### 29వ వార్డు నాయకులు అంగటి శ్రావణ్ కుమార్



**విశాఖపట్నం, జూన్ 28 నేటి మనదేశమ్ :** 29వ వార్డులో చేపట్టిన పల్స్ పోలియో 2026 కార్యక్రమంలో 29వ వార్డు నాయకులు అంగటి శ్రావణ్ కుమార్ పాల్గొని 5 సంవత్సరాల లోపు పిల్లలకు 2 పోలియో చుక్కలు వేయడం జరిగింది. 29వ వార్డులో ప్రతి ఏరియా నుండి పెద్ద ఎత్తున్న తల్లిదండ్రులు హాజరై చిన్న పిల్లలుకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. 29వ వార్డు నాయకులు అంగటి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ 29వ వార్డులో బాధ్యతాయుతంగా తల్లిదండ్రులు వారి పిల్లలకు పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పోలియో చుక్కలు వేయించడం ఎంతో ఆనందదాయకం అని దీనికి ప్రధానంగా ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చేసి పాల్గొనేలా చేసిన పాత్ర హెల్త్ వర్కర్లదే అని కొనియాడారు. అంగవైకల్యం రాకుండా పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు పోలియో చుక్కలు తప్పని సరి అని అన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క హెల్త్ వర్కర్లకు, తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మీ ఏరియాలు కూడా పరిశుభ్రంగా ఉన్న రోజునే సీజనల్ వ్యాధుల నుండి కూడా కాపాడు కోగలమని, ప్రజలు అప్ర మత్తంగా ఉండి వాటిని ఎదుర్కో వాలని ఎవరికి ఏ సమస్య వచ్చినా మాకు తెలియజేయాలని మా టీం సభ్యులందరూ అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు అంగటి శ్రావణ్ కుమార్ మరియు టీం సభ్యులు పాల్గొన్నారు.

## పోలియో రహిత దేశమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి..!



**భీమునిపట్నం జూన్ 28 నేటి మనదేశమ్ :** ప్రజా ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, గంటా నూకరాజు అన్నారు. పల్స్ పోలియో సందర్భంగా భీమిలి జోన్ 3వ డివిజన్ బోయవీధి, ఎగువపేట, నేరళ్లవలస కోలనీ, ప్రభుత్వ ఆసుపత్రిలలో జరిగే కార్యక్రమంలో గంటా నూకరాజు పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యులు కళ్యాణచక్రవర్తి, కల్యాణిలతో పాటు వైద్య సిబ్బందితో పాల్గొని 0-5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్య క్రమంలో ఏఎన్ఎమ్ భవానితో శ్రీ నూకాలమ్మ ధర్మకర్తల మండలి చైర్మన్ చురకల రమణ తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరాలపై దాడులు

**మన్యం : జూన్ 28 నేటి మనదేశమ్ :** నవోదయం 2.0 లో భాగంగా ఆదివారం ఆంధ్ర- ఒడిశా సరిహద్దులో ఉన్న అనిజ, వనివ పోలీసులు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 220 లీటర్ల నాటుసారాతోపాటు, 11 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి. శ్రీనివాసరావు తెలి పారు. నాటుసారాపై సరిహద్దులో నిరంతరం నిఘా పెడు తున్నా మని, అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయాలు చేప ట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఏ.పీ.డబ్ల్యూ.జె.ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఉదయ్ ఎన్నిక



**గన్నవరం, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గన్నవరంలోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన ఏ.పీ. డబ్ల్యూ .జె.ఎఫ్, ఏ.పీ.బీ.జె.ఏల 4వ కృష్ణా జిల్లా మహాసభల్లో ఆంధ్ర జ్యోతి గన్నవరం ప్రతినిధి దొండపాటి ఉదయ్ కుమార్ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఉదయ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు. సభలో పాల్గొన్న ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేసి, విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మడకశిర ఎమ్మెల్యే

**మడకశిర జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మడకశిర



ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదివారం మడకశిర పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు, సామాన్య ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను, అర్జీలను ఎమ్మెల్యేకు సమర్పించారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో బ్యాడ్ క్యారెక్టర్స్‌కు కౌన్సిలింగ్

**చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు – సిఐ**



**ఇబ్రహీంపట్నం, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం బ్యాడ్ క్యారెక్టర్స్ మరియు గంజాయి సేవించే వారి కోసం ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లను ఉద్దేశించి ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఎటువంటి చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడిన యెడల వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గంజాయి సేవించే వారు భవిష్యత్తులో గంజాయి తాగకుండా ఉండాలని సూచించారు. గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించి, సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సెక్టర్ ఎస్ఐ రవివర్మ,క్రైం ఎస్ఐ సేనాపతి శ్రీనివాస్,కొండపల్లి సెక్టర్ ఎస్ఐ చక్రదర్,మహిళా ఎస్ఐ సత్యవతి,స్టేషన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేమూరు మండలంలో 90 శాతం పల్స్ పోలియో డాక్టర్ సౌమ్య

**వేమూరు జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదివారం



వేమూరు మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. మండల వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ యామిని దివ్య తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. నవజాత శిశువుల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు అందించారు. మండలంలో మొత్తం 3256 మంది పిల్లలకు గాను 3154 మందికి చుక్కలు వేశారు.

## మాజీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే



**పలమనేరు జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదివారం బెంగళూరులోని యలహంకలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో కలిసి, నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, మరియు "వెన్నుపోటుకు రెండేళ్ళ" నిరసన కార్యక్రమాల నిర్వహణపై చర్చించినట్లు వెంకటే గౌడ తెలిపారు. ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది.

## మూలపాడు ఓల్డ్ ఎస్సీ ఏరియాలో పల్స్ పోలియో చుక్కల పండుగ

**వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మహాలక్ష్మి చేతుల మీదుగా చిన్నారులకు పోలియో చుక్కలు**

**మూలపాడు, జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మూలపాడులోని ఓల్డ్ ఎస్సీ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్,మహాలక్ష్మిముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. పోలియో బారిన పడకుండా ప్రతి పిల్లవాడిని కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పకుండా రెండు చుక్కల పోలియో మందు వేయించాలని సూచించారు .ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ నర్సు మిడ్వైఫ్ – ఏఎన్ఎం ఎ. వెంకటేశ్వరమ్మ,అంగన్వాడీ టీచర్ బి.రాజ కుమారి,ఆశా కార్యకర్త కె.సరిత,తదితరులు పాల్గొన్నారు.





## ఈ నెల 29వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం నిర్వహిస్తాం..

----జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఈ నెల 29వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం ––ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం – ప్రజా సమస్యల పరిష్కార వేదిక– కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చున్నారు. మీకోసం ––ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చున్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ఆర్టీవో కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లు కూడా యధా విధంగా జరుగుతాయి కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.

## చెస్ కేవలం ఆట కాదు జీవన పాఠం:ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడివాడలో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు...**

**200 మందికి పైగా క్రీడాకారుల హాజరు...ప్రారంభించిన ఎమ్మెల్యే రాము**



**గుడివాడ జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** చెస్ కేవలం ఆట కాదు జీవన పాఠం అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.ప్రతి స్కూల్లో చెస్ క్లబ్ పెట్టాలనీ ఆయన సూచించారు. ఎన్టీఆర్ స్టేడియం స్పోర్ట్స్ క్యాలెండర్ లో భాగంగా ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో 11వ ఎన్టీఆర్ మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు ఆదివారం జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావుతో కలిసి పోటీలను ప్రారంభించి, క్రీడాకారులతో చెస్ ఆడి ఉత్సాహపరిచారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, గుడివాడలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్న స్టేడియం కమిటీను, ఆంధ్రా చెస్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. "చెస్ అనేది కేవలం ఆట కాదు, ఏకాగ్రత, వ్యూహం, సహనం నేర్పే జీవన పాఠం అన్నారు. పిల్లలు మొబైల్ గేమ్స్ వదిలి బోర్డు మీద ఆలోచించడం నేర్చుకోవాలన్నారు. కోనేరు హంపి, హారిక లాంటి తెలుగు చెస్ స్టార్లను స్ఫూర్తిగా తీసుకుని మన పిల్లలు కూడా అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్ స్టేడియంలో మరిన్ని రాష్ట్రస్థాయి ఈవెంట్లు తీసుకురావడానికి తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. క్రీడా కోటా, శిక్షణా సదుపాయాలు, కోచ్‌ల నియామకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సీఎం చంద్రబాబు నాయుడు క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. పిల్లల టాలెంట్‌ను గుర్తించి చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోటీలో పాల్గొన్న అన్ని జిల్లాల క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెప్పి, విజేతలకు ముందస్తు అభినందనలు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసామని విజేతలకు బహుమతులు అందిస్తామని వైస్ చైర్మన్ యలవర్తి తెలిపారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిల్లారపు రంగప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్ జైన్, మున్నలూరి లక్ష్మణరావు, జీవిత సభ్యులు పిన్నమనేని వెంకట రామయ్య, స్టేడియం సిబ్బంది, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## శంకరంపాడులో వెనిగండ్ల ఫౌండేషన్ ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం...

**ఎమ్మెల్యే రాము దంపతులకు డీజే, పూలవర్షంతో ఘన స్వాగతం**



**నందివాడ జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పార్టీలు చూడకుండా కష్టంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయంగా ఉంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పునరుద్ఘాటించారు. అభివృద్ధిలో గ్రామస్తులు కూడా సంకల్పంతో ముందుకు రావాలనీ ఆయన పిలుపునిచ్చారు. మారుమూల గ్రామాల్లో దాహం తీర్చేందుకు వెనిగండ్ల ఫౌండేషన్ మరో ముందడుగు వేసింది. నందివాడ మండలం శంకరంపాడు గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను గ్రామస్తుల సమక్షంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము – సుఖద దంపతులు ప్రారంభించారు. ముందుగా గ్రామ పొలిమేరలో డీజే డప్పు వాయిద్యాలు, బాణసంచా మోతల నడుమ గ్రామస్తులు ఎమ్మెల్యే దంపతులకు అపూర్వ స్వాగతం పలికారు. మహిళామణులు పూలవర్షం కురిపిస్తూ, మంగళహారతులతో ఆత్మీయతను చాటుకున్నారు. పొలిమేర నుంచి వాటర్ ప్లాంట్ వరకు కాలినడకన వచ్చిన ఎమ్మెల్యే రాముకు దారి పొడవునా గ్రామస్తులు అభివాదాలు, కరచాలనాలతో నీరాజనం పలికారు. ప్లాంట్‌ను ప్రారంభించగానే గ్రామస్తుల హర్షధ్వానాలు మిన్నంటాయి. ఫిల్టర్ అయిన నీటి నాణ్యతను స్వయంగా పరిశీలించిన ఫౌండేషన్ కన్వీనర్ సుఖద, బిందెల్లో నీటిని నింపి మహిళలకు స్వయంగా అందించారు. ఈ సందర్భంగా సుఖద మాట్లాడుతూ, "మారుమూల శంకరంపాడులో గతంలో పర్యటించినప్పుడు నీటి సమస్య నా దృష్టికి వచ్చిందనీ,గ్రామస్తుల గుర్తించే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇది ఆరంభం మాత్రమే... ఇంకా మరెన్నో మంచి కార్యక్రమాలు గ్రామంలో జరగాలనీ ఆకాంక్షిం చారు. నేడు మీ అందరినీ కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పాటు ఫౌండేషన్ తరపున అండగా ఉంటాం" అని వెనిగండ్ల సుఖద హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.... "శంకరంపాడుకు ఎప్పుడు వచ్చినా మీరంతా గుండెల్లో పెట్టుకుని ఆహ్వానిస్తారనీ,నాకు వెల్కమ్ చెప్పడంలోనే కాదు... గ్రామాభివృద్ధి, సమస్యల పరిష్కారంలోనూ ఇలాగే కలిసికట్టుగా ఉండాలనీ ఆకాంక్షించారు. పార్టీలు చూడకుండా... కష్టంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయంగా ఉంటానని ఉద్ఘాటించారు. గ్రామాల అభివృద్ధిలో ఏమాత్రం రాజీ పడననీ,మారుమూల గ్రామాల ప్రజల కష్టాలు తీర్చేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నాం" అని స్పష్టం చేశారు. "ఇప్పటికే నియోజకవర్గంలో దశాబ్దాల రోడ్ల సమస్యలను పరిష్కరించామని,దానికి శంకరంపాడే ప్రత్యక్ష సాక్ష్యం అని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. 30 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు తర్వాత ఇప్పుడు కూటమి హయాంలో రూ.60 లక్షలతో ప్రధాన రహదారి నిర్మిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నామని ఆయన తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని పనులు ఆలస్యమైనా... శంకరంపాడు లాంటి శివారు గ్రామాలు, కాలనీల్లో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం" అని ఎమ్మెల్యే రాము వివరించారు. ప్లాంట్‌లో నీటిని ఫిల్టర్ చేయకుండా నేరుగా ట్యాంకుల్లో నింపుతున్న విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే, వెంటనే మైక్రో ఫిల్టర్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. "గ్రామాల అభివృద్ధిలో మేం ఎంత కృషి చేసినా, గ్రామస్తులు కూడా సంకల్పంతో ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు. ప్లాంట్ నిర్మాణానికి తన మిత్రుడు ఎన్నారై జితేంద్ర, వెనిగండ్ల ఫౌండేషన్ తరపున సహకరించారని, గ్రామస్తులందరి తరపున ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, వెనిగండ్ల ఫౌండేషన్ సభ్యులు దేవరపల్లి వినయ్ కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు ఆర్వేపూడి రామశాస్త్రి, ఉప్పల వెంకటేశ్వరరావు, చేకూరు జగన్మోహన్రావు, ఐజ ఏసుబాబు, సింగరాల రాధాకృష్ణ, చేయబోయిన సీతయ్య, కుర్మా శ్రీను, కోనేరు వెంకటేశ్వరరావు, ఎండిఓ మల్లీశ్వరి,గ్రామ నాయకులు పందుల రాజారావు,కేలే సుబ్బారావు, =. దావీదు, ˆా. ప్రకాష్, కోకన్వీనర్గా. సునీల్, పులవర్తి ప్రదీప్ కుమార్, ఖమ్మం దాసు, ప్రభుదాస్, ఆర్ రవి కిషోర్, నంద, మండలంలోని పలు గ్రామాల నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలి



**రేపల్లె జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదివారం బాపట్ల జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రేపల్లె సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 135వ మన్ కీ బాత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోడీ ప్రసంగాన్ని విద్యార్థులు ఆలకించారు. 10వ తరగతి విద్యార్థిని పులివర్తి హాసిని అత్యధిక మార్కులతో ప్రథమ స్థానం సాధించడంతో, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు యల్లమాటి దాసుబాబు, సీనియర్ నాయకుడు బేతపూడి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు ఆమెను సన్మానించారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు..ఐదు సంవత్సరాలు లోపల పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు ఇప్పించండి.



**ఎన్టీఆర్ జిల్లా .జగ్గయ్యపేటజూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇంతకుముందు భారతదేశంలో పోలియోకి వ్యాక్సిన్ లేక భారతదేశం పోలియో వ్యాధి చేత బాధపడుతూ ఉండేది. ఈరోజు భారతదేశంలో అలాంటి పరిస్థితి లేకుండా చేయడం ప్రజల పట్ల మన ప్రభుత్వం చేపడుతున్న ఉచిత పోలియో వ్యాక్సినేషన్ ని అందరూ వినియోగించుకోవాల్సిన గా కోరుచున్నాను. భారతదేశం పోలియో రహిత దేశం. కానీ కొన్ని దేశాల్లో పోలియో ఇప్పటికీ ఉంది మరియు మళ్ళీ తిరిగి రావచ్చు కనుక మీ పిల్లలకు రక్షణ కల్పించడంలో ఎలాంటి తప్పులు చేయవద్దు. పోలియో మోతాదును ప్రతిసారి ఇవ్వండి పోలియోపైన విజయం సాధించడంలో దేశానికి తోడ్పడండి. జగ్గయ్యపేట.మున్సిపాలిటీ డివిజన్ స్కూల్ నందు ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేసిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య రాజగోపాల్. మరియు మార్కెట్ యాడ్ చైర్మన్ మల్లెల సీతమ్మ. మల్లెల కొండ. ధూళిపాల లక్ష్మణరావు. ఏఎన్ఎం ము లు.. ఆశాలు. అంగన్వాడి టీచర్లు. ప్రభుత్వ ఆస్పటల్ డాక్టర్స్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు...

## ఎక్సైజ్ ఆకస్మిక తనిఖీలు..

మద్యం శాంపిల్స్ సేక



**నరసరావుపేట జూన్ 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల, బొల్లాపల్లి మండలాల్లో ఆదివారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రొంపిచర్లలోని నీలకంటేశ్వర, త్రికోటేశ్వర వైన్స్ షాపులతో పాటు బొల్లాపల్లిలోని గణేశ్, వెంకటేశ్వర, పరమేశ్వరి వైన్స్ దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మద్యం నిల్వలు, రికార్డులు, విక్రయ విధానాన్ని పరిశీలించిన అధికారులు నాణ్యత నిర్ధారణ కోసం పలు బ్రాండ్ల మద్యం సీసాలను శాంపిల్స్‌గా సేకరించి, రసాయన పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపనున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com